

జన కేతనం
- చోడవరం... ఆది నుంచీ టీడీపీ ఆధిక్యం
- నచ్చకపోతే 'నోటా' నొక్కొచ్చు
- నక్కపల్లిలో ఎన్నికల కేంద్రం

- 5లో

రాజీనామా చేయకుంటే అంతే!

వలంటీర్లకు ఐప్యాక్ ద్వారా హెచ్చరికలు

- విధుల్లో వున్న వాళ్లకు భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని సంకేతాలు
- అధిక శాతం వలంటీర్లు రాజీనామాలకు దూరం
- జిల్లాలో 352 సచివాలయాల్లో 5,670 మంది వలంటీర్లు
- ఇప్పటికి రాజీనామా చేసింది కేవలం 526 మందే


చింతపల్లిలో ఈ నెల 15న రాజీనామా చేసిన వలంటీర్లు

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

గ్రామ వలంటీర్లు రాజీనామాలు చేసి ఎన్నికల్లో వైసీపీ కోసం పని చేయాలని ఇన్నాళ్లు ఒత్తిడి చేసిన అధికార పార్టీ నేతలు రూటు మార్చారు. ఎన్ని ఒత్తిళ్లు, ప్రలోభాలకు గురి చేసినా జిల్లాలో ఆశించిన స్థాయిలో వలంటీర్లు స్పందించకపోవడంతో... వలంటీర్లుగా పని చేస్తే ఇబ్బందులు తప్పవని, రాజీనామా చేసి వైసీపీ కోసం పని చేసిన వాళ్లకు మాత్రమే భవిష్యత్తు ఉంటుందని పేర్కొంటూ ఐప్యాక్ బృందం ద్వారా బెదిరింపులకు పాల్పడుతున్నారు.

జిల్లాలోని 22 మండలాల పరిధిలో 352 సచివాలయాల్లో 5,670 మంది వలంటీర్లు పని చేస్తున్నారు. వైసీపీ ఒత్తిడి మేరకు ఇప్పటికి కేవలం 526 మంది మాత్రమే రాజీనామా చేశారు. దీంతో ఎలాగైనా మిగిలిన వారిని సైతం రాజీనామా చేయించి తమ పార్టీ కార్యకర్తలుగా పని చేయించుకోవాలని గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా వలంటీర్ల సంఘాలు, ఐప్యాక్ బృందాలతో రాజీనామా చేయని వలంటీర్లపై ఒత్తిళ్లు కొనసాగిస్తున్నారు.

భవిష్యత్తు ఉండదని వలంటీర్లకు బెదిరింపులు

గ్రామ వలంటీర్లు రాజీనామాలు చేసి ఎన్నికల్లో వైసీపీ తరఫున ఓట్లు వేయించిన వారికి మాత్రమే జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత భవిష్యత్తు ఉంటుందని ప్రచారం చేస్తున్నారు. రాజీనామాలు చేయని వలంటీర్ల భవిష్యత్తుకు గ్యారంటీ లేదని, వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే జగన్ తొలి సంతకం, తొలగించిన వలంటీర్ల కోసమే పెడతారని ప్రచారం చేస్తున్నారు. అందువల్ల ప్రస్తుతం వలంటీర్లుగా వున్న వాళ్లంతా రాజీనామాలు చేసి వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని, అలాగే పని చేసిన వలంటీర్లకు దినసరి వేతనంతో పాటు ప్రత్యేక బహుమతులు ఇస్తామని పేర్కొంటున్నారు. వైసీపీ ప్రచారానికి దూరంగా, వలంటీర్ విధుల్లో వున్న వారి భవిష్యత్తు పరిస్థితులు ఎలా ఉంటాయో చెప్పలేమని బెదిరింపుల సంకేతాలను పంపుతున్నారు.

అధికార పార్టీ బెదిరింపులకు స్పందించని వలంటీర్లు

రాజీనామాలు చేసి ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థుల గెలుపునకు పని చేయాలని అధికార వైసీపీ ఎన్ని రకాల బెదిరింపులకు పాల్పడినా గ్రామ వలంటీర్ల నుంచి ఆశించిన స్పందన కనిపించడం లేదు. జిల్లా వ్యాప్తంగా 5,670 మంది వలంటీర్లు ఉంటే, కేవలం 526 మంది మాత్రమే రాజీనామాలు చేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చునని పలువురు వలంటీర్లు అంటున్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రాదనే అనుమానంతో పాటు టీడీపీ అధికారంలోకి వస్తే నెల వేతనం పెరగడంతోపాటు మరింత ఆదాయం వస్తుందనే ఆశతో వలంటీర్లు ఉన్నారు. దీంతో ఎక్కువ మంది వలంటీర్లు తాము రాజీనామాలు చేయబోమని తెగేసి చెబుతుండడంతో ఐప్యాక్ బృందం సభ్యులు, వైసీపీ శ్రేణులు అయోమయంలో పడ్డారు. అయినప్పటికీ ఏదో మార్గంలో ప్రలోభ పెట్టో, భయపెట్టో వలంటీర్లను రాజీనామా చేయించి ఎన్నికల్లో తమకు అనుకూలంగా వాడుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పరిస్థితులపై ఎన్నికల అధికారులు నిఘా పెట్టి అధికార వైసీపీ ప్రలోభాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మన్యంలో ఏడు నామినేషన్లు దాఖలు

- అరకులోయకు ఆరు, పాడేరుకు ఒకటి

పాడేరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మన్యంలోని పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాలకు మంగళవారం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. పాడేరు అసెంబ్లీ ఆర్వో వి.భావన వశిష్ఠ, అరకులోయ ఆర్వో వి.అభిషేక్ అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. పాడేరు అసెంబ్లీ స్థానానికి గతంలోనే నామినేషన్ దాఖలు చేసిన వైసీపీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు మరో సెట్టును మంగళవారం దాఖలు చేశారు.

అరకులోయ స్థానానికి ఆరు నామినేషన్లు

అరకులోయ అసెంబ్లీ స్థానానికి ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా బురిడి ఉపేంద్ర, దండకారణ్య విమోచన సమితి వ్యవస్థాపకుడు చెండా ఏలియా, సివేరి అబ్రహం, వంతాల రామన్న, నరాజి మధుబాబు, మర్రి ఉషారాణి స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లను ఆర్వో అభిషేక్‌కు సమర్పించారు. మంగళవారం ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థుల నామినేషన్లు కాకపోవడంతో పాడేరులో పెద్దగా హడావిడి కనిపించలేదు. అయినప్పటికీ పోలీసులు రెండు ఆర్వో కార్యాలయాల పరిసరాల్లోనూ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

చినుకు పడితే చీకటే..!

- చింతపల్లి 33కేవీ విద్యుత్ లైన్‌లో తరచూ సాంకేతిక సమస్యలు
- విద్యుత్ సరఫరా నిలిపివేత.. మళ్లీ ఎప్పటికి వస్తుందో తెలియని దుస్థితి

- 6లో

ఇంతుల వేడుక.. ఇటుకల పండగ

ఏజెన్సీలో పండగ గేట్లతో మహిళల సందడి

- ప్రతి ఏడాది చైత్రమాసంలో గిరి సంప్రదాయ పండగ హడావిడి


పాడేరు- చోడవరం మార్గంలో మంగళవారం మినుములూరు వద్ద ఆర్టీసీ బస్సును ఆపుతున్న గిరి మహిళలు

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

మన్యంలోని గిరిజనుల ఆచారాలు, సంప్రదాయాలు భిన్నంగా ఉంటాయి. అలాగే వారి పండగలు, వేడుకలు సైతం అందరిని ఆకట్టుకునేలా విభిన్నంగానే తరతరాలుగా కొనసాగుతున్నాయి. ఆ కోవకే వస్తుంది ఇంతులు (మహిళలు) పండగగా భావించే ఇటుకల పండగ.


ద్విచక్రవాహన దారుడి వద్ద పండగ చందా స్వీకరిస్తున్న గిరి మహిళలు

మన్యంలో ప్రతి ఏడాది చైత్ర మాసంలో చేసే ఇటుకల పండగతో గిరిజన పల్లెల్లో సందడి నెలకొంటుంది. మైదాన ప్రాంతంలో ఉగాది పండగనే ఏజెన్సీలోని గిరిజనులు ఇటుకల పండగగా జరుపుకోవడం ఆనవాయితీ. వాస్తవానికి ఇది 'ఇంతుల పండగ'.. అంటే ఇది కేవలం మహిళలకు సంబంధించిన పండగ కావడంతో దీనిని ఇంతులు(మహిళలు) పండగగా అంటారు. కానీ కాలక్రమేణా 'ఇటుకల పండగ'గా పిలవడంతో అదే కొనసాగుతున్నది. దీంతో గిరిజనులు చైత్రమాసమంతా ఈ పండగను తమ ప్రాంతాల ఆచారాలను అనుసరిస్తూ నిర్వహించుకుంటుంటారు. ప్రస్తుతం ఏజెన్సీలో ఎక్కడికక్కడ గేట్లు పెట్టి మహిళలు పండగ చందాలు వసూలు చేస్తున్న దృశ్యాలు దర్శనమిస్తున్నాయి.

పండగలో పూర్వీకులు ఇలా చేసేవారు

చైత్రమాసం ప్రారంభం రోజున గిరిజనులు పండించే పంటల విత్తనాలను, గ్రామ పొలిమేరలో ఉండే సంకు దేవుడు వద్ద పెట్టి, కోడి కోసి పూజలు చేసేవారు. తమ పంటలు బాగా పండాలని దేవుడికి మొక్కుకుని, పూజలో ఉంచిన విత్తనాలను తమ పంట పొలాల్లో చల్లేవారు. ఇలా చేయడం వల్ల తమ పంటలు బాగా పండుతాయనేది గిరిజనుల విశ్వాసం. అలాగే గిరిజనులు తమ గ్రామం నుంచి బయటకు వెళ్లినా, బయట నుంచి గ్రామానికి వచ్చినా, పొలిమేరలో ఉన్న సంకుదేవుడికి నమస్కరించడం ఆచారంగా భావిస్తారు. కాగా ఇటుకల పండగలో భాగంగా గ్రామంలోని బావ, బావమరుదులు వరుస అయ్యే వాళ్లంతా వేర్వేరు బృందంగా ఏర్పడి, తమ మధ్య వివిధ రకాల పోటీలను పెట్టుకుంటారు. ఇందులో భాగంగానే బాణంతో గుడ్డను కొట్టడం, అడవిలోంచి తీసుకువచ్చిన తాడులాంటి బద్దను లాగడం వంటి ఆటలు ఆడతారు. అలాగే చిన్నపిల్లల కోసం గ్రామాల్లో ఉయ్యాలలు కడతారు. గిరిజనులు వేటకు వెళ్లే ముందు సైతం బాణంతో గుడ్డను కొట్టే సంప్రదాయం ఉంది. గురితప్పకుండా ఆ గుడ్డకు బాణం తగిలితే వేటలో విజయం సాధిస్తామని గిరిజనులు విశ్వసిస్తారు.

ఈ పండగలో మహిళలదే పైచేయి

మన్యంలోని ఇటుకల పండుగలో మహిళలదే పైచేయిగా ఉంటుంది. పండగకు సంబంధించిన అన్ని వ్యవహారాల్లో వారిదే కీలకపాత్ర. ఆఖరుకు పండగలో భాగంగా వేటకు

... మిగతా 6వ పేజీలో

టీడీపీలో చేరనున్న సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు


మాట్లాడుతున్న లోతుగెడ్డ సర్పంచ్ చింతర్ల సునీల్, ఎంపీటీసీ సభ్యుడు బాబూరావు

చింతపల్లి, ఏప్రిల్ 23: వైసీపీ ప్రభుత్వంలో సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయిన నేపథ్యంలో వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరనున్నట్టు లోతుగెడ్డ సర్పంచ్ (వైసీపీ మద్దతు) చింతర్ల సునీల్ తెలిపారు. మంగళ వారం ఆయన వైసీపీ ఎంపీటీసీ సభ్యుడు పాంగి బాబూరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గెలిచి మూడేళ్లు అయినా పంచాయతీ పరిధిలో నిధులు లేక ఏ ఒక్క అభివృద్ధి పని చేపట్టలేకపోయామన్నారు. దీనిపై ప్రజలకు సమాధానం చెప్పలేక తప్పించుకొని తిరగాల్సి వస్తున్నదన్నారు. పంచాయతీ ప్రజల అభిప్రాయలు తీసుకుని టీడీపీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. శుక్రవారం పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సమక్షంలో తనతో పాటు ముగ్గురు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు టీడీపీలో చేరనున్నట్టు తెలిపారు. మరి కొంతమంది సర్పంచులు సైతం టీడీపీలోకి వారం, పది రోజుల్లో వస్తారని చెప్పారు.

బడికి టాటా.. ఇంటి బాట

- విద్యా సంవత్సరం ముగియడంతో స్వగ్రామాలకు వెళుతున్న విద్యార్థులు


లగేజీతో ఇళ్లకు బయలుదేరుతున్న దృశ్యం

విద్యా సంవత్సరం ముగిసింది. మంగళవారం నుంచి విద్యార్థులకు వేసవి సెలవులు ప్రకటించారు. గిరిజన ప్రాంతంలో ఎక్కువగా ఆశ్రమ పాఠశాలలు ఉండడంతో గిరిజన విద్యారులు దాదాపుగా ఏడాదంతా ఆశ్రమ విద్యాలయాల్లోనే ఉంటారు. కేవలం సెలవుల్లో మాత్రమే ఇళ్లకు వెళతారు. దీంతో వేసవి సెలవులు ఎప్పుడు వస్తాయా అని విద్యార్థులు ఎదురు చూస్తుంటారు. మంగళవారం నుంచి సెలవులు కావడంతో ఇక పాఠశాలలకు టాటా చెప్పి తల్లిదండ్రులతో కలిసి ఇంటి బాట పట్టారు. - ఆంధ్రజ్యోతి/పాడేరు


బైక్‌పై తన కుమార్తెను తీసుకు వెళుతున్న ఓ తండ్రి


సందడి లేని పాడేరు రహదారి

తగ్గని సూర్య ప్రభావం

మూడు రోజులు వర్షం పడినా తగ్గని ఎండ

- కొయ్యూరులో అత్యధికంగా 40.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

పాడేరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మన్యంలో గత మూడు రోజులుగా వరుసగా భారీ వర్షం కురిసినా భానుడి ప్రభావం మాత్రం తగ్గలేదు. దీంతో మంగళవారం ఏజెన్సీలో ఎండ తీవ్ర ప్రభావం చూపింది. కొయ్యూరులో 41.7, పాడేరులో 40 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం నుంచే ఎండలు ప్రభావం చూపాయి. మధ్యాహ్నం వేళలో ఎండ ధాటికి బయటకు రావడానికి జనం సంకోచించారు. సాయంత్రం ఆరు గంటల తరువాత నుంచి ఎండ లేనప్పటికీ ఉక్కపోత, వేడి వాతావరణం మాత్రం కొనసాగింది.

గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఇలా..

కొయ్యూరులో మంగళవారం 40.7, పాడేరులో 40.0 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, అనంతగిరిలో 35.8 అరకులోయలో 35.0, చింతపల్లిలో 37.6, డుంబ్రిగుడలో 39.7, జీకేవీధిలో 39.7, జి.మాడుగులలో 37.9, హుకుంపేటలో 35.7, ముంచంగిపుట్టులో 38.7, పెదబయలులో 38.7 డిగ్రీల సెల్సియస్‌గా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

కోడ్ అమల్లో ఉన్నా రంగు వదల్లా!

- తాగునీటి పథకం ట్యాంకుకు తొలగని వైసీపీ రంగు
- పట్టించుకోని అధికారులు

కొయ్యూరు, ఏప్రిల్ 23: మండలంలో ఎన్నికల నిబంధనలు సక్రమంగా అమలు కావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా యథేచ్ఛగా ఉల్లంఘనలు జరుగుతున్నాయి. దీనికి నిదర్శనమే మండలంలోని కంఠారం గ్రామంలో అధికార వైసీపీ జెండా రంగులతో దర్శనమిస్తున్న తాగునీటి పథకం ట్యాంకు. కంఠారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కూతవేటు దూరంలో డేగలపాలెం, కొమ్మిక, బొర్రంపేట, చింతలపూడి తదితర గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకుని ఇది ఉంది. నిత్యం ఈ ట్యాంకును చూసుకుంటూ సచివాలయ సిబ్బంది, మండల అధికారులు, ఎన్నికల నిర్వహణకు వీలుగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్క్వాడ్ బృందాలు తిరుగుతున్నా ఈ ట్యాంకు రంగు మార్పించేలా కనీస చర్యలు తీసుకోలేదు. దీంతో ఎన్నికల నిబంధన అమలు తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి.


కంఠారం పీహెచ్‌సీ సమీపంలో వైసీపీ రంగులతో ఉన్న తాగునీటి పథకం ట్యాంకు

జగన్ రోడ్‌షో వెలవెల

విశాఖలో మలిరోజు పర్యటనలోనూ అదే సీన్

- బస్సు యాత్రకు కనిపించని స్పందన
- పీఎంపాలెం క్రికెట్ స్టేడియం వద్ద కొద్దిమంది జనం
- వారంతా ఆటోల్లో తీసుకువచ్చినవారే
- ఆ తర్వాత జనం లేకపోవడంతో బస్సులోకి వెళ్లి కూర్చున్న జగన్
- రోడ్డుపక్కన ఉన్న ఇద్దరు, ముగ్గురికీ నమస్కారం చేసుకుంటూ ముందుకు...


విశాఖ నగర పరిధిలోని మధురవాడ చంద్రంపాలెంలో జగన్ బస్సు యాత్ర

విశాఖపట్నం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత 'మేమంతా సిద్ధం' పేరుతో జిల్లాలో నిర్వహిస్తున్న బస్సు యాత్రకు మంగళవారం కూడా ప్రజల నుంచి స్పందన కరువైంది. విశాఖ పరిధిలో ఆదివారం రోడ్‌షో నిర్వహించిన ఆయన...సోమవారం యాత్రకు విరామం ప్రకటించారు. 21వ రోజు యాత్రలో భాగంగా మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఎండాడలోని ఎంవీవీ సిటీ వెనుక బస చేసిన ప్రాంతం నుంచి బస్సు యాత్రను జగన్ ప్రారంభించారు. అప్పటికే ఆరు, ఏడు, ఎనిమిది వార్డుల నుంచి ఆటోల్లో తరలించిన జనాలను నాయకులు పీఎం పాలెం క్రికెట్ స్టేడియం వద్ద జాతీయ రహదారి పక్కన నిలబెట్టి ఉంచారు. ఉదయం ఎనిమిది గంటలకే వారందరినీ అక్కడకు తీసుకువచ్చారు. తొమ్మిది నుంచి ఎండ తీవ్రంగా ఉండడంతో వారంతా విలవిల్లాడిపోయారు. సీఎం జగన్ బస్సుపై నిలబడి వారందరికీ అభివాదం/నమస్కారం చేసుకుంటూ ముందుకుసాగారు. అయితే స్టేడియం దాటేసరికి ఒక్కరు కూడా రోడ్డు మీద లేకపోవడంతో జగన్ బస్సుపై నుంచి దిగి లోపల కూర్చున్నారు. అక్కడి నుంచి రోడ్డుపక్కన నిలబడి చూస్తున్న వారికి నమస్కారం చేసుకుంటూ వెళ్లిపోయారు. మధురవాడ, కొమ్మాది, పరదేశిపాలెం, బోయిపాలెం జంక్షన్ల వద్ద కొద్ది సంఖ్యలో మాత్రమే జనం కనిపించడంతో వారికి బస్సులో నుంచే జగన్ నమస్కారం చేశారు. ఆనందపురం జంక్షన్‌లో కూడా పెద్దగా జనం లేరు. పూలమార్కెట్ వద్ద కొంతమంది ఉండడంతో సీఎం జగన్ మళ్లీ బస్సుపైకి వారికి నమస్కారం చేసుకుంటూ ముందుకువెళ్లి తర్వాత బస్సులోకి వెళ్లి కూర్చుండిపోయారు. అనంతరం అక్కడకు కొద్దిదూరంలో ఉన్న చెన్నా కన్వెన్షన్ సెంటర్‌కు వెళ్లి వైసీపీ సోషల్ మీడియా విభాగం వలంటీర్లతో సమావేశమయ్యారు. మధ్యాహ్నం భోజనం విరామం తర్వాత విజయనగరం బయలుదేరి వెళ్లారు.

అరకొర సిబ్బంది.. విధులకు ఇబ్బంది..

నర్సీపట్నం సెబ్ స్టేషన్‌లో ఇదీ ప్రస్తుత పరిస్థితి

- నాలుగు మండలాల పరిధిలో 92 పంచాయతీలు
- అధికంగా నాటు సారా, గంజాయి, అక్రమ మద్యం కేసులు
- నియామకాలు చేపట్టని వైసీపీ ప్రభుత్వం
- ఉన్నవారు తీవ్ర ఒత్తిడి గురవుతున్న వైనం

నర్సీపట్నం, ఏప్రిల్ 23 : గంజాయి, నాటు సారా, మద్యం అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) స్టేషన్‌లో సిబ్బంది నియామకాలను ప్రభుత్వం చేపట్టక పోవడంతో ఉన్నవారు తీవ్ర పనిఒత్తిడికి గురవుతున్నారు. సరికదా ఇటువంటి నేరాలు అదుపు చేసేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఎక్సైజ్ శాఖలోని సిబ్బందిని సర్దుబాటు చేసి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పేరుతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఈ సిబ్బందికి గంజాయి, నాటు సారా, మద్యం అక్రమ రవాణాను అరికట్టే బాధ్యలను అప్పగించి, ఎక్సైజ్ శాఖకు ప్రభుత్వ మద్యం విక్రయాలు, రెస్టారెంట్ బార్‌లు లైసెన్స్‌లు బాధ్యలు అప్పగించారు.

ఈ సెబ్ పరిధిలో 92 పంచాయతీలు

ఇక్కడి సెబ్ స్టేషన్ పరిధిలో నర్సీపట్నం, మాకవరపాలెం, కోటవురట్ల, రోలుగుంట మండలాలు ఉన్నాయి. ఈ నాలుగు మండలాలలోని 92 పంచాయతీలలో సుమారు 200 గ్రామాలు ఉంటాయి. మిగిలిన సెబ్ స్టేషన్‌లు కంటే ఇక్కడ నాటు సారా కేసులు అధికం. నర్సీపట్నం మునిసిపాలిటీలోని పెదబొడ్డేపల్లి, రోలుగుంట మండలం పెదపేట, కొంతలం గ్రామాలలో నాటు సారా తయారీ, రవాణా, విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. సారా బట్టీలను కనిపెట్టి, దాచి పెట్టిన బెల్లం ఊటను ధ్వంసం చేయడం, నాటు సారా సీజ్, నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం వంటి విధులు సెబ్ స్టేషన్ సిబ్బంది చేపట్టాలి. గ్రామాలలో పరివర్తన కార్యక్రమం చేపట్టి నాటు సారా తయారీ, విక్రయాలు జరక్కుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి



రావికమతం మండలంలో బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న కానిస్టేబుల్



నర్సీపట్నంలోని సెబ్ స్టేషన్

నాలుగు నెలల్లో కేసుల వివరాలివి

ఇదిలావుంటే, గత డిసెంబరు 26 నుంచి ఏప్రిల్ మొదటి వారం వరకు 28 కేసుల్లో 362 లీటర్ల నాటు సారా సీజ్ చేసి 12 మందిని అరెస్టు చేశారు. సారా తయారీదారులు ప్లాస్టిక్ కవర్లు, డ్రమ్ములలో దాచి పెట్టిన 1,10,380 లీటర్లు బెల్లం ఊటను ధ్వసం చేసి 160 కేసుల్లో నలుగుర్ని అరెస్టు చేశారు. బెల్టు షాపులపై దాడులు చేసి 78 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా 236.97 లీటర్లు అక్రమ మద్యం సీజ్ చేసి 79 మందిని అరెస్టు చేశారు. ఏజెన్సీ నుంచి నర్సీపట్నం, రోలుగుంట మీదుగా గంజాయి రవాణా అధికంగా జరుగుతుంది. సారా, మద్యం, గంజాయి అక్రమ రవాణా అరికట్టాలి ఉంటే స్టేషన్‌లో అవసరమైన సిబ్బంది ఉండాలి. గతంలో ఎక్సైజ్ శాఖలో పని చేసే సిబ్బందిని ప్రభుత్వం సెబ్‌కు, ఎక్సైజ్ శాఖ విభాగాలకు సర్దుబాటు చేసింది తప్పితే, కొత్తగా నియామకాలు చేపట్టలేదు.



నర్సీపట్నం సబ్ పరిధిలో సారా బట్టీని స్వాధీనం చేసుకున్న అధికారులు

నాలుగు మండలాలు.. ఏడుగురు సిబ్బంది

నర్సీపట్నం సెబ్ స్టేషన్ పరిధిలో ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐ ఐదుగురు కానిస్టేబుళ్లు పని చేస్తున్నారు. స్టేషన్‌కి హెడ్ కానిస్టేబుల్ లేరు. ఐదుగురు కానిస్టేబుళ్లలో ఒకరు సెంట్రీ డ్యూటీకి స్టేషన్‌లో ఉండి పోతున్నారు. నాటు సారా, మద్యం కేసులకు ఒకరు, గంజాయి కేసులకు ఒకరు కోర్టు పనులపై తిరగాల్సి వస్తుంది. మిగిలిన ఇద్దరు కానిస్టేబుళ్లు, సీఐ, ఎస్‌ఐ నాలుగు మండలాల్లో ఇటవంటి నేరాలు అదుపు చేయడానికి పని చేస్తున్నారు. ఎక్సైజ్ స్టేషన్‌గా ఉన్నప్పుడు సీఐ, ముగ్గురు ఎస్‌ఐలు, ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, 12 మంది కానిస్టేబుళ్లు, ఒక రైటర్ పని చేసేవారు. ప్రస్తుతం సెబ్ స్టేషన్‌లో సిబ్బంది సరిపోక ఉన్నవారు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఫలితంగా గంజాయి, సారా, మద్యం రవాణా చర్యలు పూర్తిస్థాయిలో చేపట్టలేకపోతున్నారు.

చంద్రబాబును కలిసిన తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 23: టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు సోమవారం రాత్రి విజయనగరం జిల్లా శృంగవరపుకోటలో పార్టీ అధినేత చంద్రబాబునాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. తనను ఈ పదవికి నియమించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ పరిస్థితి, ఎన్నికల ప్రచారం తదితరాలపై ఇరువురూ చర్చించారు.



చంద్రబాబుతో తాతయ్యబాబు

సహకార సంఘ ఉద్యోగిపై ఆర్‌వోకు ఫిర్యాదు

- వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారని ఆరోపణ

మాకవరపాలెం, ఏప్రిల్ 23 : మండలంలోని తామరం కో-ఆపరేటివ్ సహకార సంఘంలో ఉద్యోగం చేస్తూ వైసీపీ ప్రచారంలో పాల్గొంటున్న గొంతిన ఆదియ్య (హరిబాబు)పై చర్యలు తీసుకోవాల్సిందిగా నియోజకవర్గ ఐటీడీపీ ఇన్‌చార్జి కోసూరు శ్రీనివాసరావు రిటర్నింగ్ ఆఫసర్ జయరాంకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం ఎమ్మెల్యే గణేశ్ నామినేషన్ సందర్భంగా ఆదియ్య వైసీపీ కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్లిన వీడియో క్లిప్పింగ్‌తో సహా ఆర్‌వోకు ఫిర్యాదు చేశారు. అలాగే గత నెల రోజులుగా తామరంలో సోషల్ మీడియాలో వైసీపీ పోస్టులు చేయంతో పాటు గ్రామంలో ఇటీవల జరిగిన వైసీపీ నాయకుల ఎన్నికల ప్రచారంలో కూడా సదరు ఉద్యోగి పాల్గొన్నారని ఆరోపించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఆదియ్యపై వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా కోరినట్టు చెప్పారు.

ఎన్నికల నియమావళి అమలు అందరి బాధ్యత

- ఎంసీసీ నోడల్ అధికారి ప్రసాద్

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 23: ఎన్నికల నియమావళి అమలుకు ప్రజలు కూడా సహకరించాలని ఎంసీసీ నోడల్ అధికారి బి.ప్రసాద్ కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియమావళి అమలుకు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లను ఏర్పాటు చేసి, నిఘా పెట్టామన్నారు. ఎక్కడైనా నియమావళి ఉల్లంఘనలు జరుగుతున్నట్టు తెలిసిన వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. నిషిద్ధ ప్రాంతాలైన ప్రార్థనా స్థలాలలో, కులాలు, మతాల వారీగా సమావేశాలు నిర్వహించడం, కానుకలు అందజేయడం, విలువైన ఆభరణాలు, ఉపకరణాలు పంచడం, ప్రలోభాలు, ఆకర్షణలకు గురిచేయడం వంటి చర్యలు ఎవరైనా చేపట్టినా వెంటనే తెలపాలన్నారు. అనుమతి లేని బ్యానర్లు, హోర్డింగ్‌లు, కరపత్రాలు, గోడపత్రికలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం నిషేధమన్నారు. ఎవరైనా ఉల్లంఘిస్తే కంట్రోల్ రూమ్ 08924 226599 నంబరుకు తెలియజేయాలన్నారు.

'అధిక నగదు, విలువైన వస్తువులతో ప్రయాణాలొద్దు'

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 23: జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అధిక మొత్తంలో నగదు, విలువైన ఆభరణాలు, వస్తువులతో ప్రయాణాలు చేయవద్దని గ్రీవెన్స్ కమిటీ కన్వీనర్ ఎల్‌డీఎం. సత్యనారాయణ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో జిల్లా గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ టీమ్‌లతో సీజ్ చేయబడిన ఏ పార్టీకి చెందని ప్రజలు తమ అవసర నిమిత్తం తీసుకువెళుతున్న నగదు, వస్తువులు తగిన ఆధారాలతో ఎఫ్‌ఐఆర్ నమోదు కాబడని కేసులు మాత్రమే ఈ కమిటీ విచారణ చేస్తుందన్నారు. ప్రజలు ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుని తమ అవసరం నిమిత్తం ముఖ్యమైన వాటిని మాత్రమే తీసుకు వెళ్లాలని సూచించారు. పట్టుబడిన సొమ్ము, వస్తువులకు సంబంధించిన ఆధారాలు చూపించి టీమ్‌లతో స్టేట్‌మెంట్ చేయించుకోవాలన్నారు.

వడ్డాదిలో నీలగిరి తోట దగ్ధం

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 23: వడ్డాదిలో మంగళవారం మూడెకరాల నీలగిరితోట దగ్ధమైంది. ఈ ప్రమాదం కారణంగా సుమారు నాలుగు లక్షలు నష్టం జరిగినట్టు బాధితుడు బాబూరావు వాపోయారు. కాల్చిన సిగిరెట్టు విసిరేసిన కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు. మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా రావికమతం అగ్నిమాపక సిబ్బంది వచ్చి అదుపుచేశారు.



నీలగిరి తోటలో చెలరేగుతున్న మంటలు

సీఎం రమేశ్ నామినేషన్‌కు తరలిరండి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు

తుమ్మపాల(అనకాపల్లి), ఏప్రిల్ 23: అనకాపల్లి బీజేపీ పార్లమెంటు అభ్యర్థి సీఎం రమేశ్ నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు కోరారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో టీడీపీ శ్రేణులతో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. బుధవారం సీఎం రమేశ్ నామినేషన్ దాఖలు చేయనున్నారన్నారు. సాయంత్రం సుంకరమెట్టజంక్షన్ నుంచి నెహ్రూచౌక్ వరకు భారీ ర్యాలీని నిర్వహించనున్నామన్నారు. నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోట్ని బాలాజీ, దనాల విష్ణుచౌదరి, కుప్పిలి జగన్, మళ్ల గణేష్, కర్రి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తాతయ్యబాబు, చిత్రంలో బుద్ధ నాగజగదీశ్వరరావు

కూటమి అభ్యర్థుల విజయానికి కృషి

- బ్రాహ్మణ కార్పొరేషన్ జిల్లా మాజీ సమన్వయకర్త 'కొమ్మనమంచి'

చోడవరం, ఏప్రిల్ 23: జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి తమవంతు కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ జిల్లా మాజీ సమన్వయకర్త, రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన యువజన కార్యదర్శి కొమ్మనమంచి నరసింహమూర్తి ప్రకటించారు. మండలంలోని గవరవరానికి చెందిన యువకులతో కలిసి మంగళవారం ఆయన చోడవరం కూటమి అభ్యర్థి కేఎస్‌ఎన్‌ఎస్ రాజును కలిసి మద్దతు ప్రకటించారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు లభించాలంటే చంద్రబాబు వంటి సమర్థ నాయకుడు అవసరమన్నారు. అందువల్లే యువతరం అంతా చంద్రబాబు పాలన కోసం ఎదురు చూస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గవరవరానికి చెందిన పలువురు యువకులు పాల్గొన్నారు.



కూటమి అభ్యర్థి రాజుకు సంఘీభావం ప్రకటించిన నరసింహమూర్తి తదితరులు

నేడు అనకాపల్లిలో ట్రాఫిక్ మళ్లింపు

- బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ నామినేషన్
- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రాకతో అప్రమత్తమైన పోలీస్ యంత్రాంగం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం జరిగే బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం నామినేషన్, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పర్యటనలతో పట్టణంలో ట్రాఫిక్‌ను పోలీసులు మళ్లించనున్నారు. అభ్యర్థులు నామినేషన్లు వేసే సందర్భంగా ఉదయం అనకాపల్లి పీటీడీ కాంప్లెక్స్ నుంచి చోడవరం వైపు వెళ్లే బస్సులను రింగురోడ్డు, లక్ష్మీదేవిపేట గేటు, గుండాల మీదుగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకుంటున్నామని ట్రాఫిక్ సీఐ పి. పైడపునాయుడు తెలిపారు. సాయంత్రం జరిగే కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పర్యటన సందర్భంగా మధ్యాహ్నం మూడు గంటల నుంచి విశాఖపట్నం వైపు నుంచి అనకాపల్లి పట్టణంలోకి వచ్చే ఆర్టీసీ బస్సులను జాతీయ రహదారి, పూడిమడకరోడ్డు జంక్షన్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే విశాఖ, విజయనగరం వెళ్లే బస్సులు కూడా జాతీయ రహదారి మీదుగా వెళతాయన్నారు. విజయనగరం వెళ్లే బస్సులు డైట్ కాలేజి జంక్షన్ నుంచి జలగలమదుం, సుంకరమెట్ట జంక్షన్ మీదుగా సబ్బవరం రోడ్డులోకి వెళతాయన్నారు. చోడవరం వైపు వచ్చి వెళ్లే బస్సులు కూడా గుండాల జంక్షన్ మీదుగా విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి, నాయుళ్ల వీధి, రింగురోడ్డు మీదుగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చోడవరం మార్గం వైపు నుంచి వచ్చి వెళ్లే భారీ వాహనాలు తుమ్మపాలలో ఏలేరు కాలువ మీదుగా మళ్లిస్తున్నామన్నారు. కశింకోట వైపు నుంచి వచ్చే వాహనాలు జాతీయ రహదారి మీదుగా పూడిమడక జంక్షన్ నుంచి పట్టణంలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామని సీఐ పైడపునాయుడు తెలిపారు.

అప్పన్న బృందంపై దొంగల దాడి

- స్వామివారి ఉంగరం అపహరణ
- భక్తి తత్వాన్ని చాటిన మృగయోత్సవం (దొంగల దోపు)

సింహచలం, ఏప్రిల్ 23 : వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి నిర్వ హించిన మృగయోత్సవం (దొంగల దోపు) వేడుక భక్తి తత్వాన్ని చాటింది. కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని స్వామి వారు తన దేవేరులతో, మంది మార్బలంతో కలిసి రాత్రి వేళ అడవికి వేటకు బయలుదేరి వెళ్లాడు. ఆ సమయంలో నీలుడు అనే చోరుడు దారి కాచి ఆ మార్గం గుండా వెళ్లే వారందరిని దోచుకునే క్రమంలో స్వామివారి బృందాన్ని కూడా అటకాయించి నగలు అపహరిస్తాడు, అదే క్రమంలో స్వామి వేలికి ఉన్న ఉంగరాన్ని అపహరిస్తాడు. ఈ ఉదంతాన్ని ఆలయ అర్చకులు వేడుకగా నిర్వహించారు. రాత్రి అరాధన అనంతరం మృగయోత్సవం (దొంగలదోపు) వైభవంగా జరిపారు.

ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని స్వర్ణాభరణాలతో అలంకరించి అశ్వవాహనం మీద, మరో పల్లకిలో తిరుమంగై ఆళ్వార్ (నీలుడు)ను, అమ్మవార్లను ఇంకొక పల్లకిలో ఉంచి సింహగిరి ప్రధాన మాడవీధుల మార్గంలోకి తీసుకువచ్చారు. మార్గమధ్యలో నీలుడు (చోరుడు)గా ఆలయ పురోహితుడు కరి సీతారామాచార్యులు నటించి హడావిడి చేసిన తీరు భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంలో నీలుడు విగ్రహానికి స్వామి శరసంధానం చేసినట్టు భావించి విగ్రహ మెడను ఒరిగినట్టు చేయడం ఉత్సవంలో విశేషం. ఉత్సవంలో అర్చక స్వాములతో పాటు సింహగిరిపై నివశించే పలువురు గిరిజన యువత పాల్గొన్నారు. ఉత్సవం అనంతరం అంతరాలయంలో స్వామివారికి పవళింపు సేవ మంగళాశాసనములు జరిపి కావాట బంధనంతో ఆరవ రోజు కార్యక్రమాలు ముగిసాయి. ఉత్సవాన్ని స్థానాచార్యులు రాజగోపాల్ నడిపించగా, ఏర్పాట్లను ఈఓ శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు ఆలయ ఏఈఓ, పర్యవేక్షణాధికారులు చేశారు. ఈ ఉత్సవానికి కొనసాగింపుగా బుధవారం ఉదయం 8 గంటలకు వినోదోత్సవం పేరుతో ఉంగారాన్ని వెతుక్కునే వేడుక నిర్వహించనున్నారు.



రాజాలంకరణలో గోవిందరాజస్వామి



నీలుడుగా (దొంగ) సీతారామాచార్యుల బృందం

ఆనందోత్సాహాల నడుమ అప్పన్న చూర్ణోత్సవం

సింహచలం, ఏప్రిల్ 23 : వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవా రం చూర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. వేకువజామున మూడు గంటలకు సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాత ఆరాధనలు పూర్తి చేశారు. ఏడు గంటలకు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ముత్యాలపల్లకి, ఆళ్వార్లు, చక్రపరుమాళ్‌ను వేరొక పల్లకిలో ఉంచి అర్చకులు వివిధ రకాల చూర్ణాలను పట్టుకుని వేదమంత్రోచ్ఛారణలు, పారాయణలు చేస్తూ ఆలయ బేడా మండపంలో ప్రదక్షిణం చేశారు. స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో చూర్ణాలను తొలుత అంతరాలయంలో మూలవిరాట్ వద్ద, తర్వాత బేడా మండపంలోని సింహవల్లీతాయర్, అండాళ్, లక్ష్మీనారాయణులు, ఆళ్వార్ల సన్నిధిలో ఉంచి పూజలు చేశారు. అనంతరం రంగులను నీటిలో కలిపి అర్చకులు, సిబ్బంది చల్లుకుని, భక్తులపై చల్లారు. అక్కడ నుంచి స్వామివారిని, అమ్మవారిని ఒక పల్లకిలో, ఆళ్వార్లను, చక్రపెరుమాళ్ (సుదర్శనుడు)ను వేరే పల్లకిలో ఉంచి మాడవీధుల్లో తిరువీధి నిర్వహించారు. ఆలయ ఈశాన్య దిక్కులోని పవిత్ర గంగధారకు తీసుకువెళ్లి అక్కడ ముందుగా సిద్ధం చేసిన వేదికపై దేవతామూర్తులను ఉంచి స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రదానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు వెంకట రమణాచార్యులు, కరి సీతారామాచార్యులు, పవన్‌కుమార్, అప్పాజీ, తదితరులు షోడశోపచారాలు సమర్పించి, పూజలు చేశారు. అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం చక్రపెరుమాళ్‌ను గంగధార ప్రవా హం కింద ఉంచి చక్రస్నానం జరిపించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి పర్యవేక్షించారు.. ఉత్సవం అనంతరం భక్తులకు వడపప్పు, పానకం ప్రసాదాలను అందజేశారు.

క్రైం... crime news

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 23: ఆర్థిక ఇబ్బందులు తాళలేక మంగళవారం తెల్లవారుజామున ఉరిపోసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్‌ఐ వి. సత్యనారాయణ తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. తాకాశివీధికి ఆనుకుని ఉన్న కుమ్మరివీధికి చెందిన కొత్తూరు రమణబాబు (35) ఎన్టీఆర్ జంక్షన్ సమీపంలోని సెల్‌ఫోన్ దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం రాత్రి ఇంటికి వెళ్లి నిద్రపోయాడు. మంగళవారం వేకువజామున మూడు గంటల సమయంలో నిద్ర నుంచి మేల్కొని సెల్‌ఫోన్‌తో సెల్ఫీ వీడియో తీశాడు. ఈ వీడియోలో తనకు చాలా అప్పులు ఉన్నాయని, వడ్డీలు కట్టలేకపోతున్నానని మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సెల్ఫీ వీడియో తీసి భార్యకు, స్నేహితులకు పంపాడు. అనంతరం ఇంట్లోంచి బయటకు వచ్చి సమీపంలోని మహానందేశ్వర ఆలయం పిల్లర్‌కు నైలాన్‌తాడుతో ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం గుడి వచ్చిన కె.శ్రీను అనే వ్యక్తి సంఘటనను చూసి కుటుంబసభ్యులకు తెలియపరిచారు. భార్య గంగాభవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. సంఘటనా స్థలానికి పట్టణ సీఐ జి.శంకరరావు, క్లూస్ బృందం, డాగ్ స్క్వాడ్ వెళ్లి తనిఖీలు చేశారు. రమణబాబుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్టు ఎస్‌ఐ తెలిపారు.



కొత్తూరు రమణబాబు (ఫైల్‌ఫొటో)

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ఎలమంచిలి, ఏప్రిల్ 23: మండలంలోని రేగుపాలెం జంక్షన్ వద్ద హైవేపై రోడ్డు దాటుతున్న వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు రూరల్ ఎస్‌ఐ సింహాచలం తెలిపారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో నాతవరం మండలం జిల్లేడిపూడి గ్రామానికి చెందిన ఐతి సత్తిబాబు మృతి చెందారన్నారు. అనకాపల్లి నుంచి తుని వైపు ప్రయాణిస్తున్న లారీ జంక్షన్ వద్ద సత్తిబాబు రోడ్డు దాటుతుండగా ఢీకొందన్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని, పూర్తి వివరాలు దర్యాప్తులో తెలియాల్సి ఉందని ఎస్‌ఐ సింహాచలం తెలిపారు.

షిప్‌యార్డులో కాంట్రాక్టు కార్మికుడు మృతి

మల్కాపురం, ఏప్రిల్ 23: షిప్‌యార్డులో ఓ కాంట్రాక్టు కార్మికుడు అకస్మాత్తుగా మృతి చెందాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ప్రకాశనగర్ ఏడుగుళ్ల జంక్షన్ వద్ద మహంతి నరేశ్‌కుమార్ (53) కుమార్తె ప్రియాంక కుమారితో కలిసి నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఆయన యథావిధిగా పనికి వెళ్లాడు. విధుల్లో భాగంగా నడిచి వెళ్తుండగా ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం ఈఎస్‌ఐ ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే నరేశ్‌కుమార్ మృతి చెందినట్టు వైద్యుడు ధ్రువీకరించారు. ఈ మేరకు ఆయన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ప్రియాంక కుమారి ఫిర్యాదు మేరకు మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

98 మద్యం బాటిళ్లతో ఒకరు అరెస్టు

ఎస్.రాయవరం, ఏప్రిల్ 23: మండలంలోని తిమ్మాపురం శివారు కోనవానిపాలెం వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న పాన్‌షాపులో మంగళవారం సాయంత్రం దాడి చేసి 98 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్టు జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ సీఐ సూర్యకుమారి తెలిపారు. పట్టుకున్న మద్యం విలువ రూ.17,010 ఉం టుందన్నారు. ఈ సందర్భంగా వీరబాబు అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు చెప్పారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు పాన్‌షాపుపై దాడి చేశామన్నారు. ఈ దాడిలో జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ టీం జీఎస్‌టీ ఆఫీసర్ ప్రసాదరావు, ఎస్‌ఐ నాగకార్తీక్, హెచ్‌సీ మహేష్, కానిస్టేబుల్ రమణ పాల్గొన్నారని సీఐ సూర్యకుమారి చెప్పారు. పట్టుబడ్డ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్టు ఆమె తెలిపారు.

కుప్పకూలిన ఉపాధి కూలీ

- పని ముగించుకొని ఇంటికి వెళుతూ మృతి
- అమ్మాజి మృతదేహాన్ని పరిశీలించిన ఎంపీడీవో, ఏపీవో

ఎస్.రాయవరం, ఏప్రిల్ 23: జాతీయ ఉపాధి హామీ పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వెళుతున్న ఉపాధి కూలి మృతి చెందిన ఘటన ఎస్. రాయవరంలో చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించి ఎంపీడీవో సత్యనారాయణమూర్తి అందించిన వివరాలిలా ఉన్నాయి. ఎస్. రాయవరం దళిత కాలనీకి చెందిన ఎలుచూరి అమ్మాజి (56) పేటసూదిపురం చెరువులో ఉపాధి పనికి వెళ్లింది. పని ముగించుకొని అమ్మాజి తిరిగి ఇంటికి వస్తుండగా ఇంటి సమీపంలోకి వచ్చేసరికి ఒక్కసారిగా రోడ్డుపై కుప్పకూలి మృతి చెందింది. విషయం తెసుకున్న ఎంపీడీవో సత్యనారాయణమూర్తి వెంటనే సర్వసిద్ధి పీహెచ్‌సీకి, తహసీల్దార్, పోలీసులకు సమాచారం అందించారు. అంతేకాకుండా ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, ఏపీవో సత్యవతి, సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యురాలు సత్యప్రియతో కలిసి దళిత కాలనీకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతోనే వడదెబ్బ తగిలి అమ్మాజి మృతి చెంది ఉంటుందని పలువురు అనుమానం వ్యక్తం చేశారు.



అమ్మాజి (ఫైల్)

పలు రైళ్లు రద్దు...దారి మళ్లింపు

విశాఖపట్నం, ఏప్రిల్ 23: విజయవాడ డివిజన్ పరిధిలో భద్రతా నిర్మాణ పనులు జరుగుతున్నందున పలు రైళ్లను రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల 29 నుంచి వచ్చే నెల 26 వరకు గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (17243), ఈనెల 30 నుంచి వచ్చే నెల 27 వరకు రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17244) రద్దు కాగా, కాకినాడ-విశాఖ మధ్య నడిచే 17267/17268 నంబర్లు గల రైళ్లను ఈనెల 29 నుం చి వచ్చే నెల 26 వరకు రద్దు చేసినట్టు పేర్కొన్నారు. ఇక, ఎర్నాకులం-పాట్నా (22643), బెంగళూరు-గువాహటి (12509), ముంబాయి-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019), ధన్‌బాద్-అలెప్పీ బొ కారో ఎక్స్‌ప్రెస్ (13351), టాటా-యశ్వంత్‌పూర్ (18111), జసిదిహ్-తంబరం (12376), హటియా-ఎర్నాకులం ఏసీ ఎక్స్‌ప్రెస్ (22837), హటియా-బెంగళూరు (12835), టాటా-బెంగళూరు (12889) తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లు కొన్ని ప్రత్యేక తేదీల్లో రానుపోను వయా విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా మళ్లింపు మార్గంలో నడిపించనున్నట్టు పేర్కొన్నారు.

విశాఖ, చెన్నై, హటియా మధ్య ప్రత్యేక రైళ్లు

వేసవి ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా విశాఖ-చెన్నై ఎగ్మోర్, విశాఖ-హటియా మధ్య ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు త్రిపాఠి తెలిపారు.

విశాఖ-చెన్నై ఎగ్మోర్-విశాఖ

08557 నంబరు గల రైలు ఈనెల 27 నుంచి జూన్ 29 వరకు ప్రతి శనివారం రాత్రి 7.00 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 8.45 గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుతుంది. తిరిగి ఈనెల 28 నుంచి జూన్ 30 వరకు ప్రతి ఆదివారం ఉదయం 10.30 గంటలకు చెన్నై ఎ గ్మోర్‌లో బయలుదేరి ఆదేరోజు రాత్రి 10.35 గంటలకు విశాఖ చేరుతుంది.

విశాఖ-హటియా-విశాఖ

08555 నంబరు గల రైలు ఈనెల ఈనెల 28 నుంచి జూన్ 30 వరకు ప్రతి ఆదివారం రాత్రి 11.50 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 2.45 గంటలకు హటియా చేరుతుంది. తిరిగి ఈనెల 29 నుంచి జూలై ఒకటి వరకు ప్రతి సోమవారం సాయంత్రం 4.00 గంటలకు హటియాలో బయలుదేరి మర్నాడు ఉదయం 9.50 గంటలకు విశాఖ చేరుతుంది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404


భూపతిరాజు సత్యనారాయణ

చోడవరం నియోజకవర్గ ప్రొఫైల్	
మండలాలు (చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట)	4
పంచాయతీలు	110
మొత్తం ఓటర్లు	2,15,396
పురుషులు	1,04,589
మహిళలు	1,10,800
ఇతరులు	7

చోడవరం... ఆది నుంచీ టీడీపీదే ఆధిక్యం

పార్టీ ఆవిర్భావం తరువాత ఇప్పటివరకూ తొమ్మిదిసార్లు ఎన్నికలు


ఆరుసార్లు తెలుగుదేశం విజయం


ఈమని సీతారామశాస్త్రి

- మూడుసార్లు కేఎస్ఎన్‌రాజు వర్సెస్ కరణం ధర్మశ్రీ
- నాలుగోసారి పోటీ పడుతున్న ఆ ఇద్దరు

చారిత్రకంగా ప్రాధాన్యం...రాజకీయంగా చైతన్యం...ఇదీ అనకాపల్లి జిల్లాలోని చోడవరం నియోజకవర్గం ప్రత్యేకత. ఉమ్మడి జిల్లాలో తెలుగుదేశం పార్టీకి గట్టి పట్టున్న నియోజకవర్గాల్లో చోడవరం ముందువరుసలో ఉంటుంది. 1983లో తెలుగుదేశం ఆవిర్భావం తరువాత ఈ నియోజకవర్గంలో తొమ్మిదిసార్లు ఎన్నికలు జరగగా, ఆరుసార్లు ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. 1983, 1985, 1994 ఎన్నికల్లో గూనూరు ఎర్రునాయుడు, 2004లో గంటా శ్రీనివాసరావు, 2009, 2014లలో కేఎస్ఎన్ఎస్ రాజు తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసి గెలుపొందారు. 1989, 1999లలో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన బలిరెడ్డి సత్యారావు గెలిచారు. ఆయన 1989లో కోట్ల విజయభాస్కర రెడ్డి మంత్రివర్గంలో మధ్య తరహా నీటిపారుదల శాఖా మంత్రిగా పనిచేశారు. గడచిన (2019) ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కరణం ధర్మశ్రీ...టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజుపై విజయం సాధించారు.


కే ఎస్ ఎన్ ఎస్ రాజు


కరణం ధర్మశ్రీ

గత (2019 ఎన్నికల్లో అభ్యర్థులకు వచ్చిన ఓట్లు	
మొత్తం ఓట్లు	2,10,313
పోలైనవి	1,77,219
కరణం ధర్మశ్రీ (వైసీపీ):	93,456
కేఎస్ఎన్ఎస్ రాజు (టీడీపీ):	66,210
పీవీఎస్ఎన్ రాజు (జనసేన):	5,246
గూనూరు వెంకటరావు (కాంగ్రెస్):	1,182
గణపతిరాజు వెంకట అప్పలరాజు (ఇండి)	928
మొల్లి వెంకటరమణ (బీజేపీ)	598
పడవల చక్రవర్తి (ఇండియా ప్రజాబంధు పార్టీ)	315
వంకాయల రామచంద్రరావు (ఇండి)	291
గొలుకొండ శ్రీనివాసరావు (జనజాగృతి)	248
నోటా	5,033


ఫ్లాష్ బ్యాక్
చోడవరం నియోజకవర్గం
చోడవరం పట్టణం వ్యూ

ఇదీ చరిత్ర

చోడవరం ప్రాంతాన్ని పూర్వకాలంలో చోడమల్లాపురంగా పిలిచేవారు. ఈ ప్రాంతాన్ని పాలించిన రాజు ఉపేంద్ర తన తల్లిదండ్రుల పేర్లు కలిసి వచ్చేలా చోడమల్లాపురం అని నామకరణం చేశారు. కాలక్రమంలో చోడమల్లాపురం కాస్తా చోడవరంగా మారిపోయింది. 1947లో చోడవరం నియోజకవర్గం ఏర్పడిన తొలినాళ్లలో ఉత్తరాపల్లి నియోజకవర్గంలో ఉన్న కె.కోటపాడు, కోడూరు, కడిగొట్ల, లక్ష్మీపురం, బుచ్చెయ్యపేట ఫిర్కాలు ఉండేవి. 1978లో నియోజకవర్గాల పునర్విభజనలో కలిగొట్ల ఫిర్కా ఉత్తరాపల్లి నియోజకవర్గంలో చేరిపోగా, కోడూరు, కోటపాడు మాడుగుల ఫిర్కాలో చేరిపోయాయి. తరువాత కాలంలో కె.కోటపాడు ఉత్తరాపల్లి నుంచి మాడుగుల నియోజకవర్గంలో చేరింది. ఇక గొంప నియోజకవర్గంలో ఉన్న రోలుగుంట, రావికమతం ఫిర్కాలు కొత్తగా చోడవరం నియోజకవర్గంలో చేరాయి. చోడవరం నియోజకవర్గ చరిత్ర చూస్తే 1951 నుంచి 2019 వరకూ జరిగిన ఎన్నికల్లో అత్యధికంగా తెలుగుదేశం పార్టీ ఆరుసార్లు విజేతగా నిలిచింది. టీడీపీకి చెందిన గూనూరు ఎర్రునాయుడు (మిలట్రీనాయుడు) మూడుసార్లు ఇక్కడ ఎమ్మెల్యేగా గెలవగా, మాజీ మంత్రి బలిరెడ్డి సత్యారావు, వేచలపు పాలవెల్లి, కేఎస్ఎన్ఎస్ రాజు రెండేసిసార్లు విజయం సాధించారు. మిగిలిన వారంతా ఒక్క దఫాకే పరిమితమయ్యారు.


రెడ్డి జగన్నాథం


పాలవెల్లి

నాలుగోసారి ఇద్దరి మధ్య పోటీ

2009, 2014, 2019 ఎన్నికల్లో కేఎస్ఎన్ఎస్ రాజు, కరణం ధర్మశ్రీ మధ్య ప్రధాన పోటీ జరిగింది. 2009 ఎన్నికల్లో కేఎస్ఎన్ఎస్ రాజు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయగా, ధర్మశ్రీ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగి రాజు చేతిలో ఓటమిపాలయ్యారు. ఇక 2014 ఎన్నికల్లో టీడీపీ తరపున కేఎస్ఎన్ఎస్ రాజు బరిలో నిలవగా, ధర్మశ్రీ వైసీపీ అభ్యర్థిగా పోటీపడి రెండోసారి రాజు చేతిలో ఓటమిపాలయ్యారు. 2019 ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసిన ధర్మశ్రీ...టీడీపీ అభ్యర్థిగా నిల్చున్న కేఎస్ఎన్ఎస్ రాజుపై విజయం సాధించారు. వచ్చే నెల జరగనున్న ఎన్నికల్లో సైతం వీరిద్దరే ప్రధాన పార్టీల అభ్యర్థులుగా పోటీపడుతుండడం విశేషంగా చెప్పుకోవాలి. దాదాపు దశాబ్దన్నరగా ఈ ఇద్దరు నేతల చుట్టూనే చోడవరం రాజకీయం నడుస్తోంది.

● చోడవరం

ఇప్పటి వరకు గెలిచిన ఎమ్మెల్యేలు

సంవత్సరం	విజేత	పార్టీ	మెజార్టీ	ప్రత్యర్థి
1947-1952	భూపతిరాజు	జాతీయ కాంగ్రెస్ పార్టీ	---	---
1952-1955	కందర్ప రామేశం	కృషికార్‌లోక్ పార్టీ	9,329	భూపతిరాజు సన్యాసిరాజు (కాంగ్రెస్)
1955-1962	రెడ్డి జగన్నాథం	ఇండిపెండెంట్	2,785	బి.జి.నాయుడు (కృషికార్ లోక్‌పార్టీ)
1962-1967	ఇలపకుర్తి సత్యనారాయణ	కాంగ్రెస్	3,440	బి.జి.నాయుడు (ఇండిపెండెంట్)
1967-1972	వేచలపు పాలవెల్లి	స్వతంత్రపార్టీ	15,300	ఇలపకుర్తి సత్యనారాయణ (కాంగ్రెస్)
1972-1978	వేచలపు పాలవెల్లి	కాంగ్రెస్	7,224	బి.సూర్యనారాయణ (ఇండిపెండెంట్)
1978-1983	ఈమని సీతారామశాస్త్రి	జనతాపార్టీ	12,066	వేచలపు పాలవెల్లి (కాంగ్రెస్)
1983-1985	గూనూరు ఎర్రునాయుడు	టీడీపీ	9,282	జి.కన్నంనాయుడు (కాంగ్రెస్)
1985-1989	గూనూరు ఎర్రునాయుడు	టీడీపీ	17,742	జి.కన్నంనాయుడు (కాంగ్రెస్)
1989-1994	బలిరెడ్డి సత్యారావు	కాంగ్రెస్	9,733	గూనూరు ఎర్రునాయుడు (టీడీపీ)
1994-1999	గూనూరు ఎర్రునాయుడు	టీడీపీ	19,076	బలిరెడ్డి సత్యారావు (కాంగ్రెస్)
1999-2004	బలిరెడ్డి సత్యారావు	కాంగ్రెస్	5,518	గూనూరు ఎర్రునాయుడు (టీడీపీ)
2004-2009	గంటా శ్రీనివాసరావు	టీడీపీ	9,616	బలిరెడ్డి సత్యారావు (కాంగ్రెస్)
2009-2014	కె.ఎస్.ఎన్.ఎస్.రాజు	టీడీపీ	1,385	కరణం ధర్మశ్రీ (కాంగ్రెస్)
2014-2019	కె.ఎస్.ఎన్.ఎస్.రాజు	టీడీపీ	612	కరణం ధర్మశ్రీ (వైసీపీ)
2019-2024	కరణం ధర్మశ్రీ	వైసీపీ	27,246	కేఎస్ఎన్ఎస్ రాజు (టీడీపీ)


ఇలపకుర్తి సత్యనారాయణ


బలిరెడ్డి సత్యారావు


గూనూరు ఎర్రునాయుడు


గంటా శ్రీనివాసరావు

పాయకరావుపేట... నియోజకవర్గం

నక్కపల్లిలో ఎన్నికల కేంద్రం

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఏకైక రిజర్వుడ్ నియోజకవర్గం పాయకరావుపేట. దాదాపు ఆరు దశాబ్దాల నుంచి పాయకరావుపేట రిజర్వుడ్ నియోజకవర్గంగా ఉంది. సాధారణంగా సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ఎక్కడ చూసినా నియోజకవర్గ కేంద్రంలోనే జరుగుతుంది. అయితే ఇక్కడ పేరుకు పాయకరావుపేట నియోజకవర్గ కేంద్రమైనా...ఎన్నికల ప్రక్రియ అంతా నక్కపల్లి కేంద్రంగా జరుగుతుండడం విశేషం.



ఎన్నికల ప్రక్రియ జరిగే నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం

పూర్వం నక్కపల్లి సమితిలో ఎస్.రాయవరం, పాయకరావుపేట, నక్కపల్లి మండలాలు ఉండేవి. అప్పటి నుంచే రాజకీయ వ్యవహారాలు, సభలు నక్కపల్లి కేంద్రంగా జరిగేవి. నక్కపల్లిలోనే పూర్వం నుంచి సబ్ ట్రెజరీ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండేవి. తాలూకా కేంద్రంగా అన్ని వర్గాలవారు నక్కపల్లి వచ్చేవారు. జిల్లా రాజకీయాల్లో కూడా పూర్వం నుంచి నక్కపల్లికి చెందిన పలువురు నాయకులు కీలకపాత్ర పోషించేవారు. జాతీయ రహదారికి కేవలం పది అడుగుల దూరంలోనే ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉండేవి. నియోజకవర్గ కేంద్రమైన పాయకరావుపేటలో ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలు పట్టణానికి దూరంగా ఉండేవి. నక్కపల్లిలో తహసీల్దార్ కార్యాలయ భవనం పూర్వం కూడా విశాలమైన ఉండేది. దాంతో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాన్ని కూడా నక్కపల్లి తహసీల్దార్ (ఎమ్మార్వో) కార్యాలయంలోనే ఏర్పాటుచేసేవారు. అందుకు అవసరమైన సదుపాయాలు ఇక్కడ వుండడంతో నక్కపల్లినే ఎన్నికల కేంద్రంగా ఏర్పాటుచేశారు. రాకపోకలకు అనువుగా ఉంటాయనే ఉద్దేశంతోనే నాటి రాజకీయ పెద్దలు ఎన్నికల కేంద్రాన్ని నక్కపల్లిలోనే ఏర్పాటుచేయాలని కోరడంతో అప్పటి యంత్రాంగం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆ విధంగా నక్కపల్లిలో నియోజకవర్గం ఎన్నికల కేంద్రం ఏర్పాటైందని చెప్పాలి.

ఇప్పటివరకూ 14సార్లు ఎన్నికలు

1962 నుంచి ఇప్పటివరకూ దాదాపు 14 పర్యాయాలు సార్వత్రిక ఎన్నికలు నియోజకవర్గంలో జరిగాయి. వచ్చే నెలలో మరోమారు ఎన్నికలు జరగనున్నాయి. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన ప్రతిసారి నక్కపల్లి రెవెన్యూ కార్యాలయంలోనే నియోజకవర్గ ఎన్నికల కేంద్రం ఏర్పాటుచేస్తున్నారు. రాజకీయ పార్టీలతో అధికారులు సమీక్షా సమావేశాలు నక్కపల్లిలోనే జరుగుతుంటాయి. ముఖ్యంగా ఎన్నికల నామినేషన్లు, ఉప సంహరణ, ఈవీఎంల పంపిణీ నక్కపల్లి నుంచే జరుగుతుండడం విశేషం. పేరుకు పాయకరావుపేట నియోజకవర్గంగా వున్న, ఎన్నికల క్రతువంతా నక్కపల్లి కేంద్రంగా జరగడం విశేషం.

● నక్కపల్లి

నచ్చకపోతే నోటా నొక్కొచ్చు..

- 2014 ఎన్నికల్లో 21,991, 2019 ఎన్నికల్లో 55,231 ఓట్లు
- 2014లో చోడవరం నియోజకవర్గంలో గెలుపు, ఓటమిల మధ్య వ్యత్యాసం 909... నోటాకే 931 ఓట్లు

ఓటుకు మన దేశ గతిని మార్చే శక్తి ఉంది. వ్యవస్థ మార్పునకు నాంది పలుకుతుంది. ఒకప్పుడు పోటీలో ఉన్న అభ్యర్థులు ఎవరూ నచ్చకపోయినా ఎవరో ఒకరికి ఓటు వేసి వేయాల్సి వచ్చింది. లేదా ఓటు హక్కు వినియోగించుకోకుండా ఉండాల్సి వచ్చేది. ఇది గతం. ఇప్పుడు అలా కాదు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2014 సార్వత్రిక ఎన్నికల్లో మొదటిసారి కేంద్ర ఎన్నికల సంఘం 'నోటా' (నన్ ఆఫ్ ద అబౌ)ను ఓటర్లకు అందుబాటులోకి తెచ్చింది. పోటీలో ఉన్న అభ్యర్థులు ఎవరూ నచ్చకపోతే 'నోటా'కు ఓటు వేసుకోవచ్చు. ఓటింగ్ యంత్రంపై అభ్యర్థులు, వారి పేర్లు, గుర్తులతో పాటు వరుస సంఖ్యలో చివర్లో 'నోటా' పేరిట ఓ గుర్తు ఉంటుంది. ఈ నోటా వల్ల కొన్ని పర్యాయాలు అభ్యర్థుల జాతకాలు తారుమారు అయిపోతున్నాయి. ఓటు వేయకుండా ఇంట్లో కూర్చోవడం సరైన నిర్ణయం కాదు. ఓటు హక్కు తప్పనిసరిగ్గా వినియోగించుకోవాలి. పోలైన ఓట్లలో 20 శాతం, అంతకంటే ఎక్కువ ఓట్లు నోటాకు పోలైతే అభ్యర్థులను ఎన్నికల సంఘం పోటీకి అనర్హులుగా ప్రకటిస్తుంది. ఆ ఎన్నికలను నిలిపివేస్తుంది. తిరిగి ఎన్నికలు నిర్వహించేందుకు తేదీలను ప్రకటిస్తే నూతన అభ్యర్థులు (ముందు అనర్హులుగా ప్రకటించినవారు కాకుండా) బరిలో నిలవాల్సి ఉంటుంది.

ఉమ్మడి విశాఖ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో 2019 ఎన్నికల్లో నోటాకు 55,231 ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఎవరూ నచ్చనప్పుడు ఓటరు తన అభిప్రాయం తెలపడానికి వీలుగా ఎన్నికల సంఘం 'నోటా'ను ప్రవేశపెట్టింది. ప్రతి ఎన్నికల్లో నోటాకు వేసినవారు పెరుగుతూనే ఉన్నారు. ఒక్కొక్క నియోజకవర్గంలో ప్రధానపార్టీ అభ్యర్థులకు వచ్చే ఓట్లు కంటే నోటాకే అధికంగా పడుతున్నాయి. అభ్యర్థులు నచ్చక ఓటు వేస్తున్నారో లేక తెలియక నోటాకు నొక్కుతున్నారో గానీ నోటాకు భారీగానే నమోదవుతున్నాయి.

2019 సార్వత్రిక ఎన్నికల్లో భీమిలి నియోజకవర్గంలో నోటాకు 4,263 ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ ప్రధాన పార్టీలైన బీజేపీ అభ్యర్థి కోరాడ అప్పారావుకు 2,468, కాంగ్రెస్ అభ్యర్థి తెడ్డు రామదాసుకు 1,880 కంటే నోటాకే అధికంగా పడ్డాయి. అలాగే విశాఖ తూర్పులో నోటాకు 1,741 ఓట్లు పడగా...కాంగ్రెస్ అభ్యర్థి వజ్జిపర్తి శ్రీనివాసరావుకు 1,663 ఓట్లు వచ్చాయి. అలాగే చోడవరం నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి గూనురు వెంకట్రావుకు 1,188, బీజేపీ అభ్యర్థి మొల్లి వెంకటరమణకు 625 ఓట్లు పడితే నోటాకు 5,036 వచ్చాయి. అలాగే మాడుగుల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి బొడ్డు శ్రీనివాస్‌కు 1657, బీజేపీ అభ్యర్థి సుబ్బలక్ష్మికి 796, జనసేన అభ్యర్థి గవిరెడ్డి సన్యాసినాయుడుకు 3,745 ఓట్లు రాగా, నోటాకు 4,672 వచ్చాయి. అలాగే అరకులోయలో గతం కంటే నోటాకు అధికంగా నమోదయ్యాయి. బీజేపీ, కాంగ్రెస్, ఇతర అభ్యర్థుల కంటే నోటాకే 10,177 ఓట్లు పోలయ్యాయి. పాడేరులో బీజేపీ అభ్యర్థి లోకుల్ గాంధీకి 4,631, కాంగ్రెస్ అభ్యర్థి వంతల సుబ్బారావుకు 4,910, జనసేన అభ్యర్థి పసుపులేటి బాలరాజుకు 6,038 ఓట్లు రాగా, నోటాకు 7,808 ఓట్లు పడ్డాయి. అలాగే పెందుర్తి, పాయరావుపేట నియోజకవర్గాల్లో బీజేపీ, కాంగ్రెస్, ఇతర ఇండిపెండెంట్ల కంటే నోటాకే అధికంగా ఓట్లు పడ్డాయి.



2014, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గాల వారీగా 'నోటా'కు వచ్చిన ఓట్లు...

నియోజకవర్గం	నోటాకు వేసిన ఓట్లు 2014	నోటాకు వేసిన ఓట్లు 2019
భీమిలి	2,468	4,263
విశాఖ తీర్పు	1,042	1,741
విశాఖ దక్షిణ	1,032	1,208
విశాఖ ఉత్తర	1,440	1,401
విశాక పశ్చిమ	1,119	1,561
గాజువాక	1,103	1,764
చోడవరం	931	5,036
వి.మాడుగుల	946	4,672
అరుకులోయ	4,933	10,177
పాడేరు	2,828	7,808
అనకాపల్లి	774	2,558
పెందుర్తి	1,150	3,737
ఎలమంచిలి	631	2,963
పాయకరావుపేట	900	5,189
నర్సీపట్నం	694	1,143
మొత్తం	21,991	55,231



నోటా టెన్షన్

నోటాను ఈవీఎంలలో చేర్చడంతో అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. బరిలో ఉన్న అభ్యర్థుల్లో ఎవరూ నచ్చకుంటే నోటాకు ఓటు వేయవచ్చు. గతంలో జరిగిన ఎన్నికల్లో నోటాకు భారీగానే పడుతుండడంతో అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. వృద్ధులు, నిరక్షరాస్యులు నోటా కూడా ఓ అభ్యర్థి గుర్తు అనుకుని ఓటు వేసే ప్రమాదం లేకపోలేదనే చర్చ జరుగుతుంది.

రీ ఎలక్షనే...

నోటా గురించి చాలా మంది సామాన్య ప్రజల్లో కొన్ని అపోహలు కూడా లేకపోలేదు. ఏ అభ్యర్థినీ కాదని నోటాకు ఓటు వేసినప్పుడు, అభ్యర్థులందరి కంటే నోటాకే ఎక్కువ ఓట్లు వచ్చినా కూడా నోటాతో సంబంధం లేకుండా ఓట్లు ఏ అభ్యర్థికి ఎక్కువ వస్తే వారు గెలిచినట్టు అనుకుంటూ ఉంటారు. ఇది పొరపాటు. ఒక నియోజకవర్గంలో అభ్యర్థులందరి కంటే నోటాకే ఎక్కువ ఓట్లు వస్తే ఆ నియోజకవర్గంలో ఏ అభ్యర్థీ గెలిచినట్టు కాదు. తిరిగి ఎన్నికలు నిర్వహించాల్సిందే. ఈ రీ ఎలక్షన్‌లో ఇంతకు ముందు పోటీ చేసిన ఏ అభ్యర్థికీ పోటీ చేయడానికి అర్హత ఉండదు. తాజాగా నిర్వహించిన ఎన్నికల్లో ఏ అభ్యర్థికి 50 శాతానికి మించి ఓట్లు వస్తాయో ఆ అభ్యర్థి గెలిచినట్టు ప్రకటిస్తారు.

● రోలుగుంట

ఓటరు మాట

విద్యావంతులకు ప్రాధాన్యమివ్వాలి



చట్టసభలకు విద్యావంతులను ఎన్నుకోవాలి. వారు విజ్ఞతతో వ్యవహరించి సభలో ప్రజాసమస్యలపై గళమెత్తగలరు. విద్య, వైద్యం, ఉపాధి లభించేలా ప్రభుత్వాన్ని ఒప్పించగలుగుతారు. స్వలాభం కోసం రాజకీయాల్లోకి వచ్చిన వారిని ఎన్నుకుంటే వారి ఆస్తులను మాత్రమే పెంచుకుంటారు. ప్రజా సమస్యలను పట్టించుకోరు. అన్ని వర్గాల వారిని సమదృష్టితో చూసే వారినే ప్రతినిధులుగా ఎన్నుకోవాలి.

- పాంగి మత్స్యకొండబాబు, అరకు

పంపకాలు కాదు అభివృద్ధి కావాలి



రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి ప్రజలకు పంచుకుంటూ పోతే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది. పరిశ్రమలు, మౌలిక వసతులు, యువతకు ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం దృష్టిపెట్టాలి. ఇలాంటి ఆలోచనలున్న అభ్యర్థిని చట్టసభలకు పంపాలి. ఆర్థిక నేరగాళ్లు, క్రిమినల్స్ రాజకీయాల్లోకి రాకుండా ఓటర్లే అడ్డుకోవాలి. అలా అయితేనే పార్టీలు వారికి టికెట్లు ఇచ్చేందుకు భయపడతాయి. ఓటర్లు ఆలోచించాలి.

- ఆర్ఎల్ఎన్ శాస్త్రి, విశ్రాంత బ్యాంకు ఉద్యోగి, గోపాలపట్నం

పనిచేసే సామర్థ్యం ఉండాలి



స్థానిక సమస్యల పరిష్కారం కోసం పనిచేసే సామర్థ్యం ఉన్న నేతను ఎన్నిక చేసుకోవాలి. చిత్తశుద్ధి, పట్టుదల, ఇచ్చిన మాట నిలబెట్టుకునే గుణం వంటి నాయకులను ఎన్నుకుంటే మంచి జరుగుతుంది. చట్టాలపై అవగాహన ఉన్న వారు ప్రజా ప్రతినిధి అయితే సమస్యలు పరిష్కరించే సత్తా ఉంటుంది. ఇలాంటి వారిని ఎంపిక చేయాలి. ఎన్నికల తరువాత కూడా ప్రజల్లో ఉండే నాయకుడితోనే మేలు.

- దుప్పల కేశవరావు, ఉక్కు విశ్రాంత ఉద్యోగి, గాజువాక

చట్టసభల గౌరవాన్ని నిలబెట్టాలి



ఎన్నికయ్యే ప్రజాప్రతినిధులు చట్టసభల గౌరవాన్ని నిలబెట్టగలగాలి. స్వప్రయోజనాల కోసం గెలవాలనుకునే వారిని ఓటుద్వారా తిరస్కరిద్దాం. అన్నివర్గాల ప్రజా సమస్యలను గుర్తించి, పరిష్కరించగలిగే వారికే మద్దతు పలకాలి. ఉచితాలతో మేలు జరగదు. పరిశ్రమలు, అభివృద్ధి చేపట్టి యువతకు ఉపాధి కల్పిస్తేనే భవిష్యత్తు. అలాంటి వారిని గుర్తించి ఓటు వేయాలి.

- స్వర్ణశైలజ, రచయిత్రి, మురళీనగర్

మీరూ పంపించండి

ఎన్నికల వేడి మొదలయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుంటున్నారు?, ఏం చేయాలని కోరుకుంటున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్ ... 9848212243

మోదకొండమ్మకు పసుపు, కుంకుమ నీటితో గిడ్డి ఈశ్వరి అభిషేకం


అమ్మవారికి పూజలు చేస్తున్న గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, ఏప్రిల్ 23: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి మోదకొండమ్మ విగ్రహానికి పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరి మంగళవారం 101 బిందెల పసుపు, కుంకుమ నీటితో అభిషేకం చేసి మొక్కును తీర్చుకున్నారు. పాడేరు ఎమ్మెల్యే టికెట్ తనకే కేటాయించాలని కోరుతూ గత నెల కుమ్మరిపుట్టు నుంచి చింతలవీధి పంచాయతీ నడిమివీధి జంక్షన్‌లో ఉన్న మోదకొండమ్మ ఆలయానికి 101 పసుపు నీళ్ల బిందెలతో పాదయాత్రగా వెళ్లి అమ్మవారికి అభిషేకం, పూజలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టీడీపీ అధిష్ఠానం టికెట్ కేటాయించడంతో మంగళవారం 101 బిందెల పసుపు, కుంకుమ నీటితో అమ్మవారి విగ్రహానికి అభిషేకం చేసి మొక్కు తీర్చుకున్నట్టు గిడ్డి ఈశ్వరి తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలవాలని, మన్య ప్రాంత ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని కోరానన్నారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు ఉషారాణి, వరలక్ష్మి, పులిగా గోపి, శాంతకుమారి, ఎస్.మణి, బుజ్జి, రాజు పాల్గొన్నారు.

కూటమి నాయకులతో గిడ్డి ఈశ్వరి భేటీ


జడ్పీ మాజీ చైర్‌పర్సన్ కాంతమ్మ, మహిళా నేతలతో గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, ఏప్రిల్ 23: పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరి తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల కూటమి సీనియర్ నాయకులతో మంగళవారం భేటీ అయ్యారు. ముందుగా టీడీపీ నాయకులు కిల్లో వెంకట రమేష్‌నాయుడు, వంజంగి కాంతమ్మ, బొర్రా నాగరాజు, కొట్టగుళ్లి సుబ్బారావు గృహాలకు వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం బీజేపీ నేత కురసా ఉమామహేశ్వరరావుతో మాట్లాడారు. కూటమి నాయకులంతా ఏకమై పాడేరు నియోజకవర్గంలో తనతో పాటు అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతను గెలిపించాలని కోరారు. అంతా ఏకమై కూటమి విజయానికి సహకరించాలని కోరారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో బటన్‌లు నొక్కి అభివృద్ధిని కుంటుపరిచారని, వచ్చే ఎన్నికల్లో ఓటర్లు రెండుసార్లు బటన్‌లు నొక్కి వైసీపీని పక్కకిపెట్టి కూటమిని అధికారంలోకి తెచ్చుకుందామని పేర్కొన్నారు. చంద్రబాబును సీఎంను చేసి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములవుదామని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు చింతవీధి మోదకొండమ్మ ఆలయ వార్షికోత్సవం


ఉత్సవాలకు సిద్ధం చేసిన అమ్మవారి ఆలయం

పాడేరు రూరల్, ఏప్రిల్ 23: మండలంలోని చింతలవీధి గ్రామంలో మోదకొండమ్మ ఆయల తొమ్మిదో వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు విజయవంతం చేయాలని వారు కోరారు.

26న రాజరాజేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



పాడేరు రూరల్, ఏప్రిల్ 23: పట్టణంలోని పురాతన శైవక్షేత్రం ఉమానీలకంఠేశ్వరుని ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈ నెల 26వ తేదీ రాజరాజేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు తెలిపారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో ఉదయం 5 గంటల నుంచి వేదపండితులు ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. అలాగే మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అదే రోజు ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులోని ఐటీడీఏ కార్యాలయ సమీపంలో అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో వేంకటేశ్వస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి భక్తులు తరలిరావాలని ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సుబ్బారావు, సర్పంచ్ ఉషారాణి కోరారు.

ఇంతుల వేడుక.. ఇటుకల పండగ

...3వ పేజీ తరువాయి


జి.మాడుగుల-మద్దిగరువు మార్గంలో ఆటోను ఆపుతున్న గిరి యువతులు

వెళ్లే క్రమంలో మొత్తం నిర్ణయం అంతా మహిళలదే కావడం విశేషం. పురుషులు అడవికి వేటకు వెళ్లి ఏదైనా జంతువును వేటాడి తీసుకువస్తేనే గ్రామంలోకి ప్రవేశించాలి. లేకుంటే గ్రామంలోకి రాకూడదనే నిబంధనల ఉంది. దీంతో వేటలో జంతువులు చిక్కే వరకు పురుషులు గ్రామాలకు వచ్చేవారు కాదు. అలాగే ఇటుకల పండగ జరిగే సమయంలో పురుషులు ఎవరూ పల్లెల్లో ఉండకూడదనే నిబంధన ఉంది. దానిని అతిక్రమించి గ్రామాల్లోకి వచ్చేవారికి గ్రామ కట్టుబాటు ప్రకారం జరిమానా విధించేందుకే ఊరి పొలిమేరలో గేటు పెట్టి, అలా వచ్చే వారి నుంచి కొంత డబ్బులు వసూలు చేసేవారు. ఆ డబ్బులతో పండగకు అవసరమైనవి కొనుగోలు చేసి ఊరంతా సహపంక్తి భోజనాలు చేస్తారు. ఇలా చైత్రమాసంలో ఏదో ఒక వారం, ఒక ప్రాంతంలోని గిరిజనులు ఇటుకల పండగను ఆచరిస్తారు. అలాగే పండగ సందర్భంగా సాయంత్రం వేళల్లో గిరిజన మహిళలు థింసా నృత్యాలతో అలరిస్తారు. కానీ మారుతున్న కాలంతో పాటు గిరిజనులు తమ ఆచారాలకు దూరమవుతున్నారు. దీంతో అడవుల్లోకి వేటకు వెళ్లేది తగ్గిపోయి, గ్రామాల్లో గేట్లు పెట్టే సంప్రదాయం వదిలేశారు. మెయిన్ రోడ్లపై గేట్లు పెట్టి డబ్బులు వసూలు చేసే సంస్కృతి పెరిగింది. దీంతో ఇటుకల పండగ అంటే గేట్లు పెట్టడమే అన్నట్టుగా పరిస్థితి మారుతున్నది.

‘కూటమి అభ్యర్థుల గెలుపుతోనే జిల్లా అభివృద్ధి’

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 23 : ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపుతేనే జిల్లా అభివృద్ధి సాధ్యమని అనకాపల్లి పార్లమెంటు బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్ సతీమణి శ్రీదేవి అన్నారు. మండలంలోని పి.భీమవరంలో ఆమె ఉపాధి కూలీలను కలిసి కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందని ఆరోపించారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అనకాపల్లి ఎంపీగా పోటీచేస్తున్న సీఎం రమేష్, చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా కేఎస్ఎన్ఎస్ రాజులను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్య క్రమంలో సీఎం రమేష్ సోదరి మాధవి, బీజేపీ నాయకులు ఈర్లె శ్రీరామమూర్తి, నాగరాజు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 23 : తెలుగుదేశం పార్టీలో చేరికలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా వైసీపీకి చెందిన బుచ్చెయ్యపేట ఎంపీటీసీ సభ్యుడు సూరిశెట్టి వెంకటరావు, రాజాం ఎంపీటీసీ సభ్యురాలు మరిసా నాగమణి తమ అనుయాయులతో కలిసి మంగళవారం ఇక్కడ టీడీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు వీరికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం జనసేన, టీడీపీ నాయకులు పీవీఎస్ఎన్ రాజు, గునూరు మల్లునాయుడు, గేదెల సత్యనారాయణ, గోకివాడ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చీకటే..!


చింతపల్లి విద్యుత్ ఉప కేంద్రం

వాతావరణం మారితే ఆందోళన.. మబ్బు పడితే భయం.. చినుకు పడితే వణుకు.. ఇదీ చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల ప్రజల దుస్థితి. కారణం.. వర్షం కురిస్తే నర్సీపట్నం-చింతపల్లి 33కేవీ విద్యుత్ లైన్‌లో సాకేంతిక సమస్యలు తలెత్తడమే! దీనికి ప్రత్యామ్నాయ మార్గం చూపే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించకపోవడంతో ఎన్నాళ్లు ఈ కష్టాలు పడాలోనని జనం గగ్గోలు పెడుతుండడం విచారకరం.

- చింతపల్లి 33కేవీ విద్యుత్ లైన్‌లో తరచూ సాంకేతిక సమస్యలు
- విద్యుత్ సరఫరా నిలిపివేత.. మరలా ఎప్పటికి వస్తుందో తెలియని దుస్థితి
- ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ నిర్మాణానికి అనుమతించని వైసీపీ ప్రభుత్వం
- చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల ప్రజలకు తప్పని కరెంట్ కష్టాలు

చింతపల్లి, ఏప్రిల్ 23:

పాడేరు ఏజెన్సీలోని చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాలకు కొరుప్రోలు 133కేవీ ఉప కేంద్రం నుంచి విద్యుత్ సరఫరా జరుగుతున్నది. కొరుప్రోలు నుంచి చింతపల్లి 33కేవీ ఉప కేంద్రం వరకు సాంకేతిక సమస్య ఎక్కడ తలెత్తినా రెండు మండలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతున్నది. ప్రధానంగా వర్షాలు పడితే చాలు లంబసింగి ఘాట్ రోడ్డు వద్ద చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై విరిగి పడడం వల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోతున్నది. లంబసింగి ఘాట్ అటవీ ప్రాంతం కావడంతో సాంకేతిక సమస్య ఏర్పడిన ప్రాంతాన్ని గుర్తించేందుకు అధిక సమయం పడుతున్నది. దీంతో ఏపీ ఈపీడీసీఎల్ అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు గంటల తరబడి సమయం పడుతున్నది. ఆదివారం కురిసిన భారీ వర్షానికి లంబసింగి ఘాట్ రోడ్డులో సాంకేతిక సమస్య ఏర్పడింది. దీంతో మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సోమవారం కురిసిన వర్షానికి మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరా లేదు. దీంతో వర్షం కురిస్తే చాలు చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల ప్రజలకు కరెంట్ కష్టాలు తప్పడం లేదు. విద్యుత్ సరఫరా ఎప్పటికి పునరుద్ధరిస్తారో తెలియక రెండు మండలాల విద్యుత్ వినియోగదారులు పడరాని పాట్లు పడుతున్నారు.

ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్‌కు అనుమతించని ప్రభుత్వం

చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల ప్రజల కరెంట్ కష్టాలను తీర్చేందుకు ఏపీ ఈపీడీసీఎల్ అధికారులు 2018లో పాడేరు 133కేవీ విద్యుత్ ఉప కేంద్రం నుంచి ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను పక్కన పడేసింది. దీంతో మరోసారి 2022లో ఏపీ ఈపీడీసీఎల్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అయితే ఈ ప్రతిపాదనలపై కూడా వైసీపీ ప్రభుత్వం స్పందించలేదు. అధికార పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ, వైసీపీ నాయకులు సైతం ప్రత్యామ్నాయ విద్యుత్ నిర్మాణంపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అవసరమైన నిధులు మంజూరు చేయించడంలో విఫలమయ్యారు. దీంతో ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది. వైసీపీ ఐదేళ్ల పదవీ కాలం ముగిసిపోయినప్పటికీ చింతపల్లి, గూడెంకొత్తవీధి విద్యుత్ వినియోగదారులకు పాడేరు నుంచి ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ నిర్మాణం చేపట్టకపోవడం వల్ల కరెంట్ కష్టాలు యథావిధిగా కొనసాగుతున్నాయి. ఈ లైన్ నిర్మాణం జరిగివుంటే కొరుప్రోలు విద్యుత్ లైన్‌లో సాంకేతిక సమస్య తలెత్తితే మరమ్మతులు చేసేవరకు పాడేరు లైన్ నుంచి విద్యుత్ సరఫరా చేసుకునే వెసులుబాటు ఉండేది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు పునరాలోచించి ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ నిర్మించి చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల ప్రజల కరెంట్ కష్టాలు తీర్చాలని వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

డాక్టర్ కోసం గర్భిణుల పడిగాపులు

- అందుబాటులో లేని గైనకాలజిస్ట్
- సీహెచ్‌సీలో గర్భిణులకు తప్పని ఇబ్బందులు


సీహెచ్‌సీ ఎదుట గైనిక్ కోసం నిరీక్షిస్తున్న గర్భిణులు

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 23: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో మంగళవారం గర్భిణులు తీవ్రమైన ఇబ్బందులు పడ్డారు. సుదూర ప్రాంతాల నుంచి వైద్య సేవల కోసం వచ్చిన వారంతా గైనకాలజిస్ట్ అందుబాటులో లేక గంటలు తరబడి నిరీక్షించారు. ఈ క్రమంలో వారు ప్రత్యక్ష నరకం చవిచూశారు.

మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి గర్భిణులు స్కానింగ్ తీయించుకొనేందుకు మంగళవారం సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. వారంతా గైనికాలజిస్ట్ కోసం గంటలు తరబడి నిరీక్షించారు. ఆమె రాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. గైనకాలజిస్టు అందుబాటు లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె నిత్యం అందుబాటులో ఉండేలా చూడాలని వారు డిమాండ్ చేశారు.అలాగే వైద్య సేవలు పొందేందుకు సీహెచ్‌సీకి వచ్చే వివిధ వ్యాధులుగ్రస్థులు సైతం ఇబ్బందలు పడుతున్నారు. అరకొర వైద్యులు, వైద్య సిబ్బంది ఉండడం వల్ల రోగులకు సంపూర్ణ వైద్య సేవలు అందడం లేదు. అలాగే మౌలిక సదుపాయాల కొరత కారణంగా సీహెచ్‌సీకి వచ్చే రోగులు ఇబ్బందులు పడక తప్పడంలేదు. సంబంధిత అధికారులు మొక్కుబడి తంతుగా సీహెచ్‌సీ తనిఖీలు చేసి వెళ్లిపోతున్నారన్న విమర్శలు వినిస్తున్నాయి. సీహెచ్‌సీకి వచ్చే వారికి సంపూర్ణ వైద్య సేవలు అందేలా చూడాలని మండల ప్రజలు, గర్భిణులు కోరుతున్నారు.

భార్యపై కత్తితో దాడి

- తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం

జి.మాడుగుల, ఏప్రిల్ 23: భార్యాభర్తల మధ్య వివాదం తలెత్తి భార్యను కత్తితో దారుణంగా గాయపరిచిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఈ విధంగా ఉన్నాయి. లువ్వాసింగి పంచాయతీ వలసమామిడి గ్రామానికి చెందిన సారే సత్యవతి గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తగా పని చేస్తున్నారు. ఆమెకు గతంలో మసాడి కొండబాబుతో వివాహం జరిగి ఒక పాప పుట్టింది. భర్త కొండబాబు తరువాత మృతి చెందడంతో తన సమీప బంధువు మసాడి విశ్వేశ్వరరావుతో సహ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం రాత్రి భర్తల ఇద్దరి మధ్యలో వివాదం తలెత్తడంతో కత్తితో భార్యకు విశ్వేశ్వరావు తీవ్రంగా గయపరిచాడు. ప్రస్తుతం బాధితురాలు విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ, పరిస్థితి విషమంగా ఉంది. జరిగిన ఘనటపై బాధితురాలు తల్లి పార్వతమ్మ ఫిర్యాదుతో స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వర్తమానంలో జీవిస్తేనే ఆనందం

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 23: వర్తమానంలో జీవిస్తేనే ఆనందంగా బతకగలమని యోగా బోధకులు ఎంవీఎస్.ప్రకాష్ చెప్పారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ(హేపీనెస్) ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహిస్తున్న యోగా శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ వర్తమానం గురించి ఆలోచించినపుడే సంతృప్తి కరమైన ఆనందాన్ని పొందుతారన్నారు. నిత్య జీవితంలో భూత, భవిష్యత్తుల గురించి ఆలోచించడం వలన అనర్థాలే తప్పా ఎటువంటి ఉపయోగాలు ఉండవని పేర్కొన్నారు. ప్రధానంగా గడిచిన కాలం గురించి ఆలోచిస్తే నిరాస, నిస్పృహ, పశ్చాత్తాపం మిగులుతుందన్నారు. యాంత్రిక జీవనంలో ఆరోగ్యంగా జీవించేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుదని ఆయన వివరించారు.

విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి

- డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభారతి

చింతపల్లి, ఏప్రిల్ 23: ఆంగ్ల భాషపై విద్యార్థులు పట్టు సాధించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి సూచించారు. మంగళవారం ప్రపంచ ఆంగ్ల భాష, పుస్తక దినోత్సవాలను కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఆంగ్ల భాష ప్రాముఖ్యత పెరిగిందన్నారు. పోటీ పరీక్షలు, ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఆంగ్ల భాష చాలా అవసరమన్నారు. విద్యార్థులు ఆంగ్ల భాషలో ప్రతిభ కనబర్చితే ఉత్తమ లక్ష్యాలను చేరుకోవచ్చునన్నారు. అలాగే ప్రతి విద్యార్థి పుస్తకాల పఠనపై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. పాఠ్యపుస్తకాలతోపాటూ విజ్ఞానం పెంపొందించే పుస్తకాలను చదవాలన్నారు. పుస్తకాలు చదవడం వల్ల విజ్ఞానం పెరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలన్ని ప్రతి రోజు సందర్శించాలన్నారు. దినపత్రికలు, పుస్తకాలు కచ్చితంగా చదవాలన్నారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసపాత్రుడు, డాక్టర్ వి. రమణ, డాక్టర్ కేజియా, రవీంద్ర, లీలాపావని, జగదీశ్, గ్రంథాలయం అధికారి టి. జగత్‌రాయ్ పాల్గొన్నారు.

చినపాచిలలో ఘనంగా పెద్ద రాయి పండగ

రావికమతం, ఏప్రిల్ 23 : మండలంలోని చినపాచిలలో పెద్ద రాయి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామంలో సాసుబిల్లి వారి పూర్వీకులైన గ్రామ పెద్ద నల్లప్ప నాయుడు కలలో ఓ దేవతామూర్తి కనిపించి నాగుల కొండ వద్ద ఓ పెద్ద రాయి ఉందని, అది మహర్షులు తపస్సు చేసిన ఎంతో మహిమగల రాయిని, దానిని గ్రామానికి తీసుకు వచ్చి వేప చెట్టువద్ద ఉంచి, ఆరాయిపై కూర్చోని తగాదాలు, సమస్యలపై తీర్పు చేబితే పరిష్కారం జరుగుతుందని చెప్పి అదృశ్యమైనట్టు పూర్వీకుల కథనం. దీంతో గ్రామ పెద్దయిన సాసుబిల్లి నల్లప్పనాయుడు, సోములు తదితరులు ఆ మాట ప్రకారం మరుసటి రోజే గ్రామానికి కొంత దూరంలో ఉన్న నాగుల కొండ వద్దకు వెళ్లి చూడగా ఎవరూ కదపలేనంత పెద్దరాయి ఉంది. దీంతో గ్రామస్థులు కొంత మంది ఏకమై ఆ రాయికి పూజలు చేసి, రోజుకు కొంత దూరం చొప్పున కదుపుతూ మూడు నెలలకు గ్రామానికి తీసుకొచ్చి వేప చెట్టువద్ద ప్రత్యేక పూజల అనంతరం ఉంచారు. సుమారు రెండు వందల ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ పెద్దరాయి వద్ద ఏటా ఇక్కడున్న కోదండ సీతారాముల కల్యాణం నిర్వహించిన ఐదో రోజున చైత్ర పౌర్ణమి నాడు పండగను జరుపుతుంటారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది.

జగన్ పాలనలో గిరిజనాభివృద్ధి శూన్యం

టీడీపీ సూపర్ సిక్స్ పథకాలతో అందరికీ మేలు: కూటమి అభ్యర్థి రాజారావు

పెదబయలు, ఏప్రిల్ 23: జగన్ పాలనలో గిరిజన ప్రాంతంలో జరిగిన అభివృద్ధి ఏమీ లేదని అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ కూటమి (బీజేపీ) అభ్యర్థి పాంగి రాజారావు అన్నారు. బీజేపీ అరకు నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి శ్రీనివాస్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిరంజీవి ఆధ్వర్యంలో మంగళవారం టీడీపీ-జనసేన-బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో గిరిజన ప్రాంతం అన్ని విధాలుగా నష్టపోయిందన్నారు. ఏ గ్రామంలో చూసినా సమస్యలు తిష్ఠ వేసి కనిపించాయని చెప్పారు. అలాగే టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించి, ఈ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందనిచెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సుకుమారి, బాబూరావు, రామయ్య ప్రశాంత్, మహేశ్వరి, ప్రసాద్, రామరావు, జయరామ్, మహేశ్, చిన్నయ్య పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్ర ప్రకాశ్

జి.మాడుగుల, ఏప్రిల్ 23: రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బొండ నరేంద్రప్రకాశ్ చెప్పారు. మంగళవారం నిర్వహించిన ఉమ్మడి నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అరకు పార్లమెంట్ అభ్యర్థిని కొత్తపల్లి గీత, పాడేరు అసెంబ్లీ అభ్యర్థిని గిడ్డి ఈశ్వరికి విస్తృతంగా ప్రచారం నిర్వహించి మంచి మెజారిటీతో గెలిపించడానికి కృషి చేయాలని విజప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కె.ఉమమహేశ్వరరావు, కె.క్రిష్ణరావు, టీడీపీ నాయకులు కె.కల్యాణం, ఎం.మత్స్యరాజు, పి.భీంబాబు, జనసేన మండల అధ్యక్షుడు ఎం.భీమన్న పాల్గొన్నారు.

లైగండలో తాగునీటి వెతలు


ట్యాంకు నుంచి చిన్న దారగా వస్తున్న నీటిని పట్టుకుంటున్న గిరిజన మహిళలు

డుంబ్రిగుడ, ఏప్రిల్ 23: మండలంలోని లైగండ పంచాయతీ కేంద్రంలో గిరిజనులు ఇబ్బందులను తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. గ్రావిటి పథకం అడుగంటిపోవడంతో గిరిజనులకు గుడెక్కడు నీటి కోసం ఇబ్బందులు తప్పడం లేదు. గ్రావీటి అడుగంటడతంతో ట్యాంకు ద్వారా వస్తున్న చిన్నపాటి ధారగా వస్తున్న నీటితో దాహం తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల్లో ఎండ తీవ్రత ఉంటే గ్రావిటి పూర్తిగా అడుగంటిపోయే పరిస్థితి ఉందని గిరిజనులు వాపోయారు. జల్ జీవన్ మిషన్ కనెక్ట్ పథకంలో భాగంగా మోటారు బోరును వేసి పైపులు, గొట్టాలు అమర్చకుండా వదిలేశారని గ్రామస్థులు ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లైగండ నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు.

ఇంటర్ ఫెయిలైన వారికి నేటి వరకూ ఫీజు గడువు

నక్కపల్లి, ఏప్రిల్ 23: ఇంటర్మీడియట్ ఫెయిలైన విద్యార్థులు ఈ నెల 24వ తేదీ నాటికి పరీక్ష ఫీజు చెల్లించాలని నక్కపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫెయిలైన విద్యార్థులతోపాటు, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం బెటర్‌మెంట్ రాయాలనుకునే విద్యార్థులు బుధవారంలోపు నక్కపల్లి జూనియర్ కళాశాలలో ఫీజు చెల్లించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

విశాఖ-చెన్నై వీక్లీ స్పెషల్‌కు ఎలమంచిలిలో హాల్ట్

ఎలమంచిలి, ఏప్రిల్ 23: ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభమయ్యే విశాఖ, చెన్నై వీక్లీ సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎలమంచిలిలో హాల్ట్ ఇచ్చినట్టు రైల్వే అధికారులు తెలిపారు. ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌కు ఎలమంచిలిలో హాల్ట్ ఇవ్వడం పట్ల ఎలమంచిలి ప్యాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి సత్యనారాయణ, ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

☛ సంక్షిప్తంగా..

నేడు ఆరు మండలాల టీడీపీ కార్యకర్తల సమావేశం

అరకులోయ, ఏప్రిల్ 23: మండల కేంద్రంలో బుధవారం అరకు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తామని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర తెలిపారు. పార్టీ అధి నాయకత్వం సూచనల మేరకు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అరకు అసెంబ్లీ అభ్యర్థి పాంగి రాజారావుకు మద్దతుగా ఆ రోజు ఉదయం 11 గంటలకు ఉషోదయ రిసార్ట్సు ప్రాంగణంలో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పార్టీకి చెందిన ఆరు మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, వివిధ హోదాల నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

గరుకుల కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెదబయలు, ఏప్రిల్ 23: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలోని వివిధ గ్రూపులలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరమ్మ తెలిపారు. 2023-2024 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యాభ్యాసం చేసి మార్చి 2024లో ప్రకటించిన ఫలితాల్లో ఉత్తీర్ణులైన గిరిజన, గిరిజనేతర విద్యార్థులు ఏప్రిల్ 24 నుంచి మే 15వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. ఏమైనా సందేహాలు ఉంటే 9494329070 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఫారం-12, 12డీ సమర్పించాలి

చింతపల్లి, ఏప్రిల్ 23: ఎన్నికల విధులు, అత్యవసన సేవలు అందిస్తున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు ఈ నెల 26వ తేదీలోగా రిటర్నింగ్ అధికారికి ఫారం-12, 12డీలు అందజేయాలని తహసీల్దార్ టి.రామకృష్ణ తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు పనిచేస్తున్న ప్రాంతంలోనే ఫారం-12 సమర్పించాలన్నారు. ఫారం-12తో పాటు ఆధార్ కార్డు, ఓటరు ఐడీ, ఎన్నికల విధుల ఉత్తర్వుల నకళ్లను జతపర్చాలన్నారు. అలాగే అత్యవసర సేవలు అందిస్తున్న మెట్రో, రైల్వే, మీడియా, విద్యుత్, బీఎస్ఎన్ఎల్, పోస్టల్, దూరదర్శన్, మిల్క్ కార్పొరేషన్, హెల్త్, ఫుడ్ కార్పొరేషన్, రోడ్ ట్రాన్స్‌పోర్టు, ఫైర్, ట్రాఫిక్, అంబులెన్సు, జైల్, ఎక్సైజ్, ట్రెజరీ, ఫారెస్టు, ఐఅండ్‌పీఆర్, పోలీసు శాఖల ఉద్యోగులు స్వయంగా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. లేకపోతే పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

ధారాలమ్మ ఆలయ మాజీ చైర్మన్‌కు నివాళులు

సీలేరు, ఏప్రిల్ 23: ధారకొండలో మృతి చెందిన టీడీపీ సీనియర్ నేత, ధారాలమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మాడుగుల పాపారావుకు పలువురు నాయకులు నివాళులర్పించారు. పాపారావు కడసారి చూపు కోసం పాడేరు, చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఈ సందర్భంగా జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తూ నాయకుడిగా, ధారాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా విశేష సేవలను అందించారన్నారు. కార్యక్రమంలో నాయకులు బొర్రా నాగరాజు, గంటా నళినీ, సర్పంచ్ కొట్టగుళ్ళి సుబ్బారావు, మహేష్, ఎం.కల్యాణి, దీసరి గంగరాజు పాల్గొన్నారు.

పెదపాడులో సీపీఎం ప్రచారం

డుంబ్రిగుడ, ఏప్రిల్ 23: పోతంగి పంచాయతీ పెదపాడు గ్రామంలో సీపీఎం నాయకులు మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచుతూ ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఎం మండల కార్యదర్శి పోతురాజు అభ్యర్థించారు. చాపరాయి గెడ్డలో వంతెన లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వంతెన నిర్మాణంలో ప్రభుత్వాలుచిన్నచూపు చూస్తుండడంతో గిరిజనులకు ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

పాడేరు రూరల్, ఏప్రిల్ 23: పాడేరు-పెదబయలు ప్రధాన రహదారిలోని చుట్టుమెట్ట జంక్షన్ సమీపంలో ఎస్ఈబీ జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం మంగళవారం నిర్వహించిన రూట్‌వాచ్‌లో మద్యం సీసాలతో ఓ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వాహన తనిఖీలను నిర్వహిస్తుండగా అటుగా వచ్చిన కొర్రా రామ్మూర్తిని తనిఖీ చేయగా బ్యాగ్‌లో 10 బీరు సీసాలు ఉన్నట్టు గుర్తించి అరెస్టు చేశారు. అతనిపై కేసు నమోదు చేశామని ఎస్ఈబీ సీఐ వీవీఎస్.శేఖర్‌బాబు తెలిపారు.

నాటుసారా విక్రయిస్తే కఠినచర్యలు

చింతపల్లి, ఏప్రిల్ 23: గిరిజన ప్రాంతంలో నాటు సారా తయారీ, విక్రయాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై.రాజు హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సర్కిల్ పరిధిలో నిఘా పెంచామన్నారు. గత ఏడాది డిసెంబరు నుంచి నేటి వరకు నాటు తయారీ, విక్రయాలు నిర్వహించే వ్యక్తులపై 146కేసులు నమోదు చేసి 55మందిని అరెస్టు చేశామన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎక్కడైనా సారా తయారీ చేస్తున్నట్టు ప్రజలు గుర్తిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.